

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com





హైదరాబాద్ | ఆదివారం 6-12-2020 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:107 | పేజీలు:4 | వెల: రూ.1/-


## మాజీమంత్రి కమతం రామిరెడ్డి మృతి



### సంతాపం ప్రకటించిన సిఎం కెసిఆర్

హైదరాబాద్,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): తెలంగాణకు చెందిన సీనియర్ రాజకీయ వేత్త,మాజీ మంత్రి కమతం రాంరెడ్డి కన్ను మూశారు.

గత కొంతకాలంగా అనారోగ్యం తో బాధపడుతున్న ఆయన శనివారం తెల్లవారు జామున హైదరాబాద్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పరిగి ఎమ్మెల్యేగా మూడు సార్లు గెలుపొందారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి మంత్రివర్గంలో రెవెన్యూ శాఖ మంత్రిగా పనిచేశారు.

1967లో జరిగిన ఎన్నికల్లో పరిగి నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. అనంతరం 1972, 1989లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అదే నియోజకవర్గం నుంచి గెలుపొందారు. 1980లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 1968లో చీఫ్‌విప్‌గా, 1977లో వెంగళరావు మంత్రివర్గంలో పౌర సరఫరాల శాఖ మంత్రిగా, 1991లో నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి మంత్రివర్గంలో మార్కెటింగ్, గిడ్డంగుల శాఖ, 1992లో కోట్ల విజయభాస్కర్ రెడ్డి కేబినెట్‌లో రెవెన్యూ శాఖ మంత్రిగా పనిచేశారు. సుదీర్ఘకాలం కాంగ్రెస్‌లో కొనసాగిన ఆయన 2014 ఎన్నికల్లో టికెట్ లభించకపోవడంతో బీజేపీలో చేరారు. టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. 2018 ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి బయటకు వచ్చిన ఆయన టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. మాజీ మంత్రి కమతం రాంరెడ్డి మృతి పట్ల సీఎం కేసీఆర్ సంతాపం వ్యక్తంచేశారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సీఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు కరోనా

### జిహెచ్ఎంసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే

హైదరాబాద్,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): తెలుగు రాష్ట్రాల్లో కరోనా డేంజర్ బెల్స్ మోగిస్తోంది. కరోనా కట్టడికి చర్యలు తీసుకున్నప్పటికీ రోజురోజుకు కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది.

మరోవైపు అధికారులు, ప్రజాప్రతినిధులు కరోనా బారిన పడటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే రెండు రాష్ట్రాల్లోనూ పలువురు ప్రజాప్రతినిధులు కరోనా తో ఆస్పత్రిలో చేరారు. కాగా ఇప్పుడు తాజాగా తెలంగాణకు చెందిన మరో ఎమ్మెల్యేకు కరోనా పాజిటివ్ వచ్చింది.

బెల్లంపల్లి నియోజక వర్గానికి చెందిన తెరాస ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కరోనా బారిన పడ్డారు. ప్రస్తుతం ఆయన నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే తో పాటు ఆయన గన్ మెన్, ఇద్దరు కుటుంబ సభ్యులకు కూడా కరోనా పాజిటివ్ వచ్చింది. అయితే తాజాగా జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికలలో బన్సీలాల్ పేట డివిజన్‌లో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఎన్నికల ప్రచారం చేసారు.

## సింగిల్ జడ్జి ఉత్తర్వులపై జోక్యం చేసుకోలేం

### సోమవారం విచారణ జరిగిన తరవాత చూద్దాం
### సిబ్బందికి శిక్షణా లోపం వల్లనే గుర్తుల సమస్యలన్న హైకోర్టు

హైదరాబాద్,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): స్వస్తిక్ గుర్తుతో పాటు ఏ గుర్తు ఉన్నా అంగీకరించాలన్న ఇసి నిర్ణయంపై సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై జోక్యం చేసుకోలేమని ఇసికి హైకోర్టు స్పష్టం చేసింది.

దీనిపై విచారించిన ప్రధాన న్యాయ మూర్తి ధర్మాసనం.. సింగిల్‌జడ్జి మధ్యంతర ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. నేరెడ్‌మెట్‌లో ఫలితం నిలిచిపో యిందని ఎస్ఈసీ తెలపగా, అందుకు సిబ్బంది శిక్షణ లోపమే కారణమని హైకోర్టు అభిప్రాయపడింది. సింగిల్ జడ్జి వద్ద సోమవారమే విచారణ ఉన్నందున అత్యవసరంగా జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని ధర్మాసనం పేర్కొంది. సింగిల్ జడ్జి వద్ద విచారణ పూర్తయ్యాక ఒకవేళ అభ్యంతరం ఉంటే అప్పీల్ చేయా లని తెలిపింది. ఇందుకు గాను సోమవారం ఉదయమే ఈ అంశంపై విచారణ జరపాలని సింగిల్ జడ్జికి ఆదేశాలు జారీ చేసింది. జీహెచ్ఎంసీ ఎన్నికల పోలింగ్‌లో ఇతర ముద్రల ఓట్లకు సంబంధించి సింగిల్ జడ్జి జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టులో ఎస్ఈసీ అప్పీల్ చేసింది. ఈ క్రమంలో ఎస్ఈసీ అప్పీలుపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి ... సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. నెరెడ్ మెట్‌లో ఫలితం నిలిచిపోయిందని కోర్టుకు ఎస్ఈసీ తెలియజేసింది. అయితే సిబ్బందికి శిక్షణ లోపమే కారణమని ధర్మాసనం అభిప్రాయ పడింది. సింగిల్ జడ్జి వద్ద సోమవారమే విచారణ ఉన్నందున అత్యవసరంగా జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. సింగిల్ జడ్జి వద్ద విచారణ పూర్తయ్యాక అభ్యంతరం ఉంటే అప్పీలు చేయాలని హైకోర్టు పేర్కొంది. సోమవారం ఉదయం మొదట ఈ అంశంపై విచారణ జరపాలని సింగిల్ జడ్జిను ధర్మాసనం ఆదేశించింది. జీహెచ్ఎంసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేరెడ మెట్ డివిజన్ మినహా పూర్తయిన సంగతి తెలిసిందే. నేరెడ్‌మెట్‌లో స్వస్తిక్ ముద్ర కాకుండా ఇతర ముద్ర ఉన్న ఓట్ల సంఖ్య ఎక్కువగా ఉన్నందున ఫలితాలు వాయిదా వేయాల్సిందిగా హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఇతర ముద్రల ఓట్లపై సింగిల్‌జడ్జి ఉత్తర్వులపై హైకోర్టులో ఎస్ఈసీ పిటిషన్ దాఖలు చేసింది.

## మేయర్ ఎన్నికలలో అనుసరించే వ్యూహంపై చర్చిస్తాం

### పార్టీలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటాం: ఓవైసీ

హైదరాబాద్,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): గ్రేటర్ హైదరాబాద్ మేయర్ పీఠంపై తమ పార్టీనేతలతో చర్చిస్తామని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. తమ వ్యూహాలు తమకు ఉన్నాయని అన్నారు. ఎవరికీ మెజార్టీ రానం దున అనుసరించాల్సిన వ్యూహంపై త్వర లోనే ఓ నిర్ణయం తీసుకుంటామని ఓవైసీ తెలిపారు. టిఆర్ఎస్‌తో కలసి పోవడానికి వారితో మాకెలాంటి పార్టీ పరమైన అవగాహన లేదన్నారు. వారి వ్యూహాలు వారికి ఉంటే...మా వ్యూహాలు మాకుంటా యని మీడియాతో అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో తన పార్టీ ప్రదర్శనతో ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణలో టీఆర్ఎస్ బలీయమైన రాజకీయ పార్టీ అని కితాబిచ్చారు. గ్రేటర్‌లోని మొత్తం 150 వార్డులకు గాను 44 వార్డులను ఎంఐఎం గెలుచుకున్నది. బీజేపీ అభ్యర్థులను గెలిపిం చేందుకు అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్ హైదరాబాద్‌లో ప్రచారం చేసిన ప్రాంతాల్లో బీజేపీ ఓటమి పాలైందని చెప్పారు. మేము ప్రజాస్వామ్య మార్గంలో బీజేపీతో పోరా డుతామని, రాష్ట్రంలో బీజేపీ విస్తరించకుండా తెలంగాణ ప్రజలు ఆపుతారని మాకు నమ్మ కం ఉన్నదని ఒవైసీ అన్నారు. కాషాయపార్టీ హైదరాబాద్‌లో సర్జికల్ స్ట్రయిక్ చేయడానికి వచ్చిందని, అయితే దీనికి ఆ పార్టీ డెమాక్రటిక్ స్ట్రయిక్‌ను ఎదుర్కోవలసి వచ్చిం దని విమర్శించారు. తెలంగాణలో 'బీజేపీ తుఫాను' వాదనలను ఆయన తోసిపుచ్చారు. బీజేపీ తుఫాను ఎక్కడ ఉంది? తుఫాను ఉ ంటే మహారాష్ట్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపో యేది కాదు కదా! అని ఒవైసీ పేర్కొన్నారు. గతంలో కన్నా మెరుగైన ప్రదర్శన కనబర్చామని, అందుకు కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో 60 స్థానాల్లో అభ్యర్థులు నిలువగా 44 వార్డుల్లో విజయం సాధించామని, అయితే అదే ఇప్పుడు 51 స్థానాల్లో అభ్యర్థులను నిలిపి 44 వార్డుల్లో విజయం సాధించా మని తెలిపారు. సికింద్రాబాద్‌లో 12 వార్డులకు గాను 9 సొంతం చేసుకున్నామని చెప్పారు. కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లు శని వారం నుంచే ప్రజా సమస్యల పరిష్కార ంలో నిమగ్నం కావాలని సూచించామని తెలిపారు. మేయర్ ఎన్నిక సమయానికి తమ పార్టీ వైఖరి వెల్లడిస్తామని అన్నారు.

## రైతు ఆందోళనతో ప్రభుత్వంలో కదలిక

### ప్రధాని మోడీతో ముగ్గురు కేంద్రమంత్రుల భేటీ
### తాజా చర్చలకు ముందే రైతు సమస్యలపై చర్చ
### చట్టాలపై రైతులతో చర్చించడానికి అభ్యంతరం లేదన్న తోమర్

న్యూఢిల్లీ,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): ప్రధాని నరేంద్ర మోదీతో కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్, తోమర్ భేటీ అయ్యారు. రైతులు, ప్రభుత్వం మధ్య శనివారం ఐదో రౌండ్ చర్చలు జరగనున్న నేపథ్యంలోనే ప్రధాని నరేంద్ర మోదీతో మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్, తోమర్ భేటీ అయ్యారు. ఈ నెల 8 న భారత్ బంద్, ఐదో రౌండ్ చర్చల నేపథ్యంలో అను సరించాల్సిన వ్యూహంపై వీరు చర్చించినట్లు సమాచారం. ఇప్పటి వరకూ రైతులతో చర్చించిన అంశాలు, రైతులు ప్రస్తావించిన డిమాండ్లను మంత్రులు ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. శనివారం రైతు సంఘాల నేతలతో కేంద్ర ప్రభుత్వం మరో దఫా చర్చలు జరపడానికి ముందు వీరు ప్రధానితో చర్చించారు. వ్యవసాయ మంత్రి నరేంద్ర తోమర్ చెబుతున్నదాని ప్రకారం... ఈ చర్చల్లో ఏదో ఒకటి తేలిపోవచ్చు. అయితే నూతన వ్యవసాయ చట్టాలపై రైతులతో చర్చించడానికి తమకేమీ అహంకారం లేదని, చర్చలకు సదా సిద్ధమేనని కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ శనివారం పునరుద్ఘాటించారు. కనీస మద్దతు ధర విషయంలోనూ తాము హామీ ఇవ్వడానికి సిద్ధమేనని పేర్కొన్నారు. మరోవైపు తమ డిమాండ్ల విషయంలో ప్రభుత్వం మాటిస్తే సరిపోదని, లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వాల్సిందేనని రైతు సంఘాల నేతలు తెగేసి చెబుతున్నారు. ఇక ప్రభుత్వంతో చర్చలు అనవసరం. ప్రభుత్వం లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వాలి. ఇప్పటి వరకూ చాలా చర్చలే జరిగాయని రైతు సంఘాల నేతలు పేర్కొన్నారు. రైతు ఆందోళనలు ఉధృతమైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. వ్యవసాయ చట్టాలను సవరించాలని ప్రధాని మోదీ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పంటల మద్దతు ధరకు హామీ, ప్రభుత్వ మార్కెట్ వ్యవస్థ బలోపేతంతో పాటు కాంట్రాక్ట వ్యవసాయానికి సంబంధించి సమస్యలు వస్తే సివిల్ కోర్టులకు వెళ్లే అవకాశం కల్పించే అవకాశాలపై కేంద్రం దిగొచ్చే అవకాశముందని ఢిల్లీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ విషయంపై న్యాయ శాఖతో కూడా వ్యవసాయ శాఖ చర్చలు జరిపినట్లు సమాచారం.అటు ఆర్ఎస్ఎస్ అనుబంధ సంఘమైన భారతీయ కిసాన్ సంఘ్ కూడా రైతుల డిమాండ్లకు మద్దతు పలికింది. కనీస మద్దతు ధర వ్యవస్థను కొనసాగించాలని, ప్రభుత్వ, ప్రైవేటు మండీల్లో కూడా ఎంఎస్పీ రేటే అమలుకావాలని, ఇందుకు చట్టం చేయాలని, ఎంఎస్పీ కంటే చౌక ధరకు కొనడం నేరమని చట్టంలో చేర్చాలని బీకేఎస్ ప్రధాన కార్యదర్శి బదరీనారాయణ చౌధురి మీడియాతో అన్నారు.

## ఢిల్లీ రైతులకు మద్దతుగా ఆర్జెడీ భారీ ప్రదర్శన

పట్నా,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): కేంద్ర వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా బీహార్‌లో ఆర్జేడీ భారీ నిరసన ప్రదర్శన చేపట్టింది. బీహార్ రాజధాని పట్నాలోని గాంధీ మైదాన్‌లో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

రైతులతో కలిసి తేజస్వియాదవ్ కూడా గాంధీ మైదాన్‌లో బైఠాయించారు. ఈ సందర్భంగా నిరసనకారులు కేంద్ర వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రం వెంటనే రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆర్జేడీ అధ్యక్షుడు తేజస్వి యాదవ్.. ఇటీవల కేంద్రం చేసిన రైతు వ్యతిరేక నల్లచట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## భారత్ బంద్‌కు లెఫ్ట్ పార్టీల మద్దతు

### రైతు సంఘాలకు సంఘీభావం ప్రకటించిన పార్టీలు

న్యూఢిల్లీ,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): ఈ నెల 8న రైతు సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త బంద్‌కు వామపక్షాలు శనివారం మద్దతు ప్రకటించాయి. సీపీఐ(ఎం), సీపీఐ(ఎం-ఎల్), రెవెల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ, ఫార్వర్డ్ బ్లాక్ సంయుక్త ప్రకటనలో తెలిపింది.

కేంద్రం తీసుకువచ్చిన కొత్త చట్టాలకు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహిస్తున్న రైతులకు మద్దతుగా భారత్ బంద్‌కు మద్దతు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలో వ్యవసాయం, ఆహార భద్రతను కాపాడేందుకు అన్నదాతల పోరాటానికి వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్, బీజేపీ చేస్తున్న ప్రచారాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నాయి. మూడు వ్యవసాయ చట్టాలతో పాటు విద్యుత్ సవరణ బిల్లు-2020ను రద్దు చేయాలని ఆయా పార్టీలు డిమాండ్ చేశాయి. తమ డిమాండ్లను పట్టించుకోకపోతే జాతీయ రహదారులను దిగ్బంధించడంతో పాటు టోల్‌ప్లాజాల్లో టోల్ వసూలు చేయకుండా చూస్తామన్నారు. ఇప్పటికే పలుసార్లు రైతు సంఘాల నేతలు కేంద్రమంత్రులతో సమావేశం కాగా.. చర్చలు కొలిక్కి రాలేదు. చట్టాలను సవరిస్తామన్న కేంద్రం ప్రతిపాదనను రైతులు తిరస్కరించారు. శనివారం మధ్యాహ్నం మరోసారి సమావేశం ప్రారంభమైంది. ఇవాళ జరిగే చర్చలైనా ఓ కొలిక్కి వస్తాయో.. లేదో.. చూడాలి.

## 28 రోజుల వ్యవధిలో రెండు డోసులు ఇవ్వాలి

### అనిల్‌విజ్‌కు కరోనా పాజిటివ్‌పై భారత్ బయోటెక్ స్పందన

న్యూఢిల్లీ,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): మూడో దశ ట్రయల్స్‌లో భాగంగా రెండు వారాల క్రితం 'కొవాగ్జిన్' టీకా షాట్ తీసుకున్న హర్యానా హోం మంత్రి అనిల్ విజ్‌కు కరోనా సోకడంపై భారత్ బయోటెక్ స్పందించింది. రెండో డోస్ తీసుకున్న 14 రోజుల తర్వాత మాత్రమే టీకా సామర్థ్యాన్ని నిర్ణయించగలమని పేర్కొంది.

కొవాగ్జిన్ క్లినికల్ ట్రయల్స్ 28 రోజుల వ్యవధిలో రెండు డోసు షెడ్యూళ్ల ఆధారంగా ఉంటాయని తెలిపింది. రెండు డోసులు తీసుకున్న తర్వాత మాత్రమే దాని సమర్థత బయటపడుతుందని పేర్కొంది. కాగా శనివారం ఉదయం మంత్రి అనిల్ విజ్ తనకు కరోనా సోకినట్టు ట్వీట్ చేశారు. ఇటీవల తనను కలిసిన ప్రతి ఒక్కరు కరోనా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఆయన అంబాలాలోని సివిల్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. కొవాగ్జిన్ మూడో దశ పరీక్షలు రెండు రకాలుగా ఉంటాయి. 50శాతం మందికి వ్యాక్సిన్ ఇవ్వగా, మిగతా 50 శాతం మందికి ప్లాసెబో అనే ద్రావణాన్ని ఇస్తారు. మంత్రికి ప్లాసిబో మాత్రమే ఇచ్చి ఉంటారని, కాబట్టి వైరస్ సోకడంలో వింతేమీ లేదంటున్నారు. రెండో డోస్ కూడా ఇచ్చిన తర్వాత మాత్రమే వ్యాక్సిన్ సామర్థ్యం నిర్ధారణ అవుతుందని చెబుతున్నారు. భారత బయోటెక్ అమెరికా, యూకేలోనూ 'కొవాగ్జిన్' కు క్లినికల్ ట్రయల్స్ నిర్వహిస్తోంది. తాము గత 20 ఏళ్లలో 18 దేశాల్లో 80 క్లినికల్ ట్రయల్స్ నిర్వహించినట్టు భారత్ బయోటెక్ తెలిపింది. 80కిపైగా దేశాలకు 4 బిలియన్‌కు పైగా డోసులు సరఫరా చేసినట్టు పేర్కొంది. భద్రత విషయంలో తమకు గొప్ప ట్రాక్ రికార్డు ఉందని స్పష్టం చేసింది. కొవాగ్జిన్‌కు భారత్‌లో నిర్వహిస్తున్న మూడో దశ ట్రయల్స్ సామర్థ్యానికి సంబంధించినది మాత్రమే. దేశ జనాభాకు ఇది ఎలా సరిపోతుందనే విషయాన్ని నిర్ధారించుకునేందుకే ఈ ట్రయల్స్ జరుగుతున్నాయి.

## ఈ ఇంజిన్‌తోనే మహిళను చంద్రుడిపైకి పంపుతా : జెఫ్ బెజోస్

హైదరాబాద్,డిసెంబర్5అమెజోన్ సీఈఓ జెఫ్ బెజోస్‌కు చెందిన ఏరోస్పేస్ కంపెనీ బ్లూ ఆరిజిన్ మొదటి మహిళను చంద్రుడిపై తీసుకెళ్లేందుకు సన్నద్ధమైంది. రాకెట్ టేకాఫ్ కోసం సన్నాహాలు కొనసాగుతున్నాయి. చంద్ర విమానానికి పరీక్షిస్తున్న రాకెట్ ఇంజిన్ గురించి ప్రజలకు ఒక సంగ్రహావలోకనం ఇస్తూ బెజోస్ శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియోను పోస్ట్ చేశారు. బెజోస్ షేర్ చేసిన వీడియోలో రాకెట్ ఇంజిన్ నుంచి శక్తివంతమైన మంటలు వస్తున్నాయి. అలబామాలోని హంట్స్‌విల్లేలోని నాసా అంతరిక్ష విమాన కేంద్రంలో జరుగుతున్న పరీక్షలకు సంబంధించి ఈ వీడియో చిత్రీకరించారు."మొదటి మహిళను చంద్రుడి ఉపరితలంపైకి తీసుకువెళ్ళే ఇంజిన్ ఇది. బీఈ 7 అనేది అధిక పనితీరు, సంకలితంగా తయారుచేసిన ద్రవ హైడ్రోజన్ / లిక్విడ్ ఆక్సిజన్ లూనార్ ల్యాండింగ్ ఇంజిన్. ఇది 10,000 ఎల్బీఎఫ్ థ్రస్ట్.. చంద్రుడిపై ఖచ్చితమైన ల్యాండింగ్ కోసం 2,000 ఎల్బీఎఫ్ వరకు ఉంటుంది. ఈ ఇంజిన్ బ్లూఆరిజిన్ నేషనల్ టీం హెచ్ఎల్ఎస్ ల్యూనార్ ల్యాండర్‌కు శక్తినిస్తుంది. ఈ వారం నాసా వద్ద పరీక్షలు జరుపుతున్న సందర్భంలో ఈ వీడియో తీశారు" అని వీడియో కింద కామెంట్ రాశారు. 2024 నాటికి మానవులను చంద్రుడి ఉపరితల ంపైకి తీసుకెళ్లడానికి బ్లూ ఆరిజిన్.. నాసా ఆర్టెమిస్ ప్రోగ్రాంతో కలిసి పనిచేస్తున్న హ్యూమన్ ల్యాండింగ్ సిస్టమ్ (హెచ్ఎల్ఎస్) ల్యాండర్‌కు బీఈ 7 ఇంజన్ అధిక శక్తినిస్తుంది.

### చరిత్రలో నేటినిజం



కం॥ సురవాహిని గా జెలగెడి
నిరుపమమగు దౌత్యవేత్త, నిష్ఠా గుణాయతా
"నిరుపమ"న భినందించుచు
కరయుగమును మోడ్చెద శుభ కామనలిడుచున్

(డిసెంబర్ 6 నిరుపమారావు జననం..)

–రాధశ్రీ
సెల్: 9494481210



## విద్వేషాలు రెచ్చగొట్టి గెలిచిన బిజెపి

### -మంత్రి ఎర్రబెల్లితో మీర్‌పేట కార్పోరేటర్ ప్రభుదాస్ భేటీ

వరంగల్,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): జీహెచ్ఎంసీ ఎన్నికల్లో విద్వేషాలు రెచ్చగొట్టి బీజేపీ, ఎంఐఎం లబ్ధిపొందాయని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఎంఐ ఎంతో పొత్తు లేకుండానే గ్రేటర్ మేయర్ పీఠాన్ని దక్కించుకుంటామని చెప్పారు. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్తగా కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, కంప్రెషర్, క్లీనింగ్ యంత్రాలను మంత్రి ప్రారంభించిన సందర్భ ంగా మాట్లాడారు. గ్రేటర్ ఎన్నికల్లో టీఆర ఎస్ అతిపెద్ద పార్టీగా అవతరిం చిందని చెప్పారు. తెలంగాణలో టీఆర్ఎస్‌కు ఎదు రులేదని జీహెచ్ఎంసీ ఎన్నికలతో మరోసారి నిరూపితమయ్యిందన్నారు. విద్వేషాలను రెచ్చగొట్టడం వల్లే ఆ రెండు పార్టీలు ఎక్కువ సీట్లు గెలుపొందాయని విమర్శించారు. అంతకుముందు గ్రేటర్ ఎన్నికల్లో విజయం సాధించిన మీర్‌పేట హౌసింగ్ బోర్డ్ టీఆర్ఎస్ అభ్యర్థి ప్రభుదాస్ మర్యాదపూ ర్వకంగా మంత్రిని కలిశారు. తన గెలుపునకు సహరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్ అభివృద్ధికి సహకరిం చాలని కోరారు. దీంతో మీర్‌పేట హెచ్‌బీ కాలనీ డివిజన్‌ను తాను దత్తత తీసుకుంటు న్నాని మంత్రి ప్రకటించారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సూచిం చారు. మీర్‌పేట హౌసింగ్‌బోర్డ్ కాలనీ డివి జన్ కార్పొరేటర్ ప్రభుదాస్ ఇవాళ హన్మకొం డలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తన గెలుపునకు సహరించినం దుకుగాను మం త్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా పనిచేయాలని సూచించా రు. ఇచ్చిన మాట ప్రకారం డివిజన్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. నిరుపేద మహిళలకు స్త్రీ నిధి లోన్లు వచ్చేలా కృషిచేస్తానని, నిరుద్యోగ యువతకు ఉ ద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఈ గెలుపునకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్య వాదాలు తెలిపారు. రాష్ట్రంలో టీఆర్ఎస్‌కు తిరుగులేదని జీహెచ్ఎంసీ ఎన్నికలతో మరోమారు నిరూపితమం య్యిందని చెప్పా రు. గ్రేటర్ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవ తరించిందని వెల్లడించారు. టీఆర్ఎస్‌పై, పార్టీ అధినేత, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నాయకత్వంపై ప్రజలు న మ్మకం ఉంచారని ప్రకటించారు. జీహెచ్ ఎంసీ ఎన్నికల్లో భాగంగా మంత్రి ఎర్రబెల్లి దయా కర్ రావు మీర్‌పేట హౌసింగ్ బోర్డు డివి జన్ ఇన్‌చార్జిగా వ్యవహరించిన విషయం తెలిసిందే.



## కాంగ్రెస్‌లో క్రమశిక్షణ లేని నేతలు: కొండా

హైదరాబాద్,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ నేతలు క్రమశిక్షణ లేని సైనికులు అంటూ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొందరు కాంగ్రెస్ నేతలు.. కేసీఆర్ జేబులో మనుషులు అన్న అపవాదు మూటగట్టుకు న్నామన్నారు. విశ్వేశ్వర్‌రెడ్డి పార్టీ మార్పుపై గత కొద్ది రోజులుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ అంశంపై కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఓ క్లారిటీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ టీఆర్ఎస్‌తో కలిస్తే మాత్రం బీజేపీలో చేరతానని కుండబద్దలు కొట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతల తీరును తీవ్రంగా తప్పుపట్టారు. కాంగ్రెస్ నేతల భాష మారాల్సిన అవసరం ఉందని, మాట కు మాట అన్నట్టుగా ఉండాలని సూచిం చారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటును సంపాది ంచడంలో వెనుకపడ్డామని చెప్పుకొచ్చారు. ఎవరికి పీసీసీ ఇచ్చినా అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్న ఒక మాట మీదకు వచ్చామన్నారు. కేసీఆర్‌కు పదునైన భాషతో బదులు చెప్పే నేతలే కావాలన్నారు. కేసీఆర్ దగ్గర చిన్న లాఠీ ఉంటే బీజేపీ వద్ద పెద్ద కర్ర ఉందన్న ఆలోచనల్లో జనం ఉన్నారని, అందుకే ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## ఎమ్మెల్యే గణేశ్ గుప్తాను పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత



నిజామాబాద్, డిసెంబర్ 5: నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తాను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పరామర్శించారు.

గణేశ్ గుప్తా తండ్రి బిగాల కృష్ణమూర్తి అనారోగ్యంతో ఇటీవల కన్నుమూ శారు. ఈ నేపథ్యంలో శనివారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎమ్మెల్యే బిగాల గణేష్ నివాసానికి వెళ్లి కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల సీఎం కేసీఆర్ సైతం ఎమ్మెల్యే గణేశ్‌గుప్తాను పరామర్శించి కృష్ణమూర్తి స్మారక వన నిర్మాణాన్ని ప్రారంభించిన విషయం తెలిసింది.

# కెసిఆర్ వైఫల్యాలే..కమల వికాసానికి ఊతలు !

నేటి నిజం
ఆదివారం 6-12-2020

భాగ్యనగరంలో ఇటీవల వరదల్లో కొట్టుకు వచ్చిన బురదలో కమలం వికసించింది. బురద ఉంటే కమలం బాగా వికసిస్తుందని జీహెచ్ఎంసీ ఎన్నికల్లో రుజువయ్యింది. నిజానికి మొన్నటి వరదల్లో ప్రజల ఇంటి ముందుకు కొట్టుకుని వచ్చిన బురద కాస్తా..కమలం వికసించడానికి దోహదపడింది. ఈ బురద లేకుండా చేయడంలో అధికార టిఆర్ఎస్ పూర్తిగా విఫలమయ్యింది. సహాయక చర్యల్లో తీవ్రనిర్లక్ష్యం వహించింది. ఫలితం బిజెపి ఎదగానికి దోహదపడింది. నిజానికి గ్రేటర్ ఎన్నికల్లో బిజెపి బలపడిందనడం కన్నా టిఆర్ఎస్ బాగా బలహీనపడిందనే చెప్పాలి. తెలంగాణ ఉద్యమంలో నిప్పుకణికలా ఉన్న కెసిఆర్... తరవాత కూడా ప్రజల్లో అలాగే ఉండలేకపోయారు. ఆయన పట్ల ప్రజలు ఏర్పరుచుకున్న భావన నుంచి వైదొలిగారు. ప్రజల భావనలో ఏర్పడిన ఫ్రేమ్‌కు దూరంగా జరిగారు. తెలంగాణ ఉద్యమంలో కెసిఆర్ అన్న మూడక్షరాల పిలుపుతో దండులా కదలివచ్చిన జనం ఆ తరవాత అదేవిధంగా తన వెన్నంటి నడుచుకునేలా వ్యవహరించడంలో కెసిఆర్ పూర్తిగా విఫలమయ్యారు. ప్రజలతో ఎంతగా సయోధ్య ఉంటే అంతమంచిదన్న సూత్రాన్ని విస్మరించారు. డబ్బులు వెదజల్లితే ప్రజలు ఎల్లకాలం ఓట్లను రాల్చరని గుర్తించలేక పోయారు. ప్రజలు ఓటు యంత్రాలుగా గుర్తించడం అన్నది ప్రజాస్వామ్యంలో పనికిమాలిన ఎత్తుగడ. ఇకపోతే అధికార పగ్గాలు చేపట్టినప్పుడే జాగ్రత్తగా ఉండాలి. అధికారం అన్నది బల్లెం లాగా ఉండాలి. దానిని జాగ్రత్తగా వినియోగించాలి. అధికారం పక్కలో బల్లెంలా ఉండాలే తప్ప చేతి బల్లెంగా మారరాదు. కానీ కెసిఆర్ చేతిలో బల్లెం చేరింది. అది ప్రజలపైకి విసరడం అలవాటయ్యింది. అధికారంతో ప్రజలకు చేరువ కావాల్సిన కెసిఆర్ తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను పక్కన పెట్టి..అధికారమనే మత్తులో తూలడం ప్రజలకు నచ్చలేదు. అధికారం వచ్చినప్పుడే మరింత జాగ్రత్తగా ప్రజలను చేరదీసుకోవాలి. ప్రజలకు ప్రగతిమార్గం చూపాలే తప్ప.. తానే ప్రగతి భవన్ నుంచి వీడి రాకపోవడం సరికాదని గుర్తించలేక పోయారు. దుబ్బాక ఎన్నిక ఫలితం... గ్రేటర్‌లో తలబొప్పి కట్టే ఫలితాలు... ఎట్టి పరిస్థితుల్లోనూ బిజెపి బలంగా చూడరాదు. అధికారం చేజిక్కించుకున్నాక తను అనుసరించిన విధానాల వైఫల్యంగా కెసిఆర్ చూడాలి. తెలంగాణ ద్రోహులను అక్కున చేర్చుకోవడం పెద్ద తప్పిదంగా గుర్తించకపోవడం ప్రధాన వైఫల్యంగా చూడాలి. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏంటన్నది ముఖ్యమే అయినా..ప్రజలను దూరం పెట్టడం కూడా ఇక్కడ తిప్పికొట్టిందని చెప్పుకోవాలి. ప్రగతిభవన్ ప్రజలకు చేరువ కావాల్సి ఉండగా పైరవీకారులకు, ధనవంతులకు మాత్రమే ద్వారాలు తెరిచేలా తయారయ్యింది. ఉదాహరణకు ఎన్ కన్వెన్షన్ విషయంలో చెరువు శిఖం ఆక్రమించిన నటుడు నాగార్జునను అక్కున చేర్చుకోవడం లాంటి సంఘటనలు ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను చాటాయి. ఇలా అనేక అంశాలు నిత్యం ప్రజల్లో చర్చ జరుగుతున్నా గుర్తించలేకపోవడం పాలకుడిగా కెసిఆర్ వైఫల్యం తప్ప మరోటి కాదు. ప్రజలు చర్చించుకుని మరచిపోయారనుకుంటే తప్పు. దీంతో అందరివాడనుకున్న కెసిఆర్ కొందరివాడన్న భావన ప్రజల్లో బలంగా నాటుకుంది. రాజకీయంగా ఎత్తుగడలు అనుసరించాల్సిందే. కానీ ఇతర రాష్ట్రాల పరిస్థితి వేరు.. తెలంగాణ పరిస్థితి వేరు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా రాజకీయ ఎత్తుగడలు సాగడమే ప్రజలు జీర్ణించుకోవడం లేదు. ఆయా రంగాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం కూడా కెసిఆర్‌పై వ్యతిరేకతను పెంచుతూ వచ్చాయి. నిజానికి కెసిఆర్ సిఎం అయ్యాక తీసుకున్న అనేక నిర్ణయాలు... కార్యక్రమాలు అన్నీ రాజకీయ కోణంలో ఉన్నవే. 24 గంటల విద్యుత్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి కార్యక్రమాలు విప్లవాత్మక నిర్ణయాలు. కానీ మిషన్ కాకతీయలో అవినీతి స్పష్టంగా కనిపిస్తుంది. ఎమ్మెల్యేలు,కార్పోరేటర్లు ఉమ్మడి ఏపిలో కన్నా అధ్వాన్నంగా డబ్బు సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నగరాన్ని తీసుకుంటే కార్పోరేటర్లు ధనార్జనే లక్ష్యంగా పనిచేశారు. మొన్నటి వరదల్లో ప్రభుత్వం ఇచ్చిన డబ్బును కాజేశారు. సంపాదనకు అలవాటు పడి ప్రజల బాగోగులను పట్టించుకోవడం మానేశారు. నగరంలో ఆయా కార్పోరేటర్లు ప్రజలతో సఖ్యతగా ఉంటూ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందారు. వారి వైఫల్యం కూడా టిఆర్ఎస్ విజయావకాశాలను దెబ్బతీసింది. ఈ అంశాలను సమీక్షించుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకోవాలి. ఎక్కడ తప్పు జరిగిందో గుర్తిస్తే చికిత్స సులువు కాగలదు. ఎదుటి పక్షాన్ని దెబ్బతీయాలన్న ఆలోచనలను పక్కన పెట్టి..ప్రజల్లో కోల్పోయిన అభిమానం తిరిగి సంపాదించే కార్యాచరణకు సిద్ధపడాలి. వందిమాగధులను..ముఖస్తితి చేసే వారిని పక్కన పెట్టాలి. ప్రజలకు చేరువ కావడం ద్వారా పోయిన ప్రభావాన్ని తిరిగి పొందడం కష్టమేమీ కాదు. బిజెపి సత్తా చాటిందని, టిఆర్ఎస్ కారు స్పీడును నిలువరించిందని వస్తున్న వార్తలను విశ్లేషించాలి. ఎక్కడెక్కడ ఎలా లోపాలు చేశామో విశ్లేషించుకోవాలి. 4 స్థానాలు నుంచి 48 స్థానాలకు ఎగబాకిన వెనక తమ వైఫల్యాలను గుర్తించాలి. దుబ్బాక విజయం ఇచ్చిన స్ఫూర్తితో గ్రేటర్‌లోనూ బిజెపి హవా కొనసాగించిందంటే అది తమ వైఫల్యమే తప్ప మరోటి కాదని తెలుసుకోవాలి. ఇప్పటి వరకు జిహెచ్ఎంసిలో రెండో స్థానంలో ఉన్న ఎంఐఎంను వెనక్కి నెట్టింది. కాంగ్రెస్‌ను 4వ స్థానంలోకి నెట్టి రాష్ట్రంలో టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం తామేననే సంకేతాలను పంపింది. దుబ్బాక కిక్కుకు తోడు జిహెచ్ఎంసీ ఫలితాలు ఇచ్చిన ఉత్సాహంతో భవిష్యత్తు ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని కమలనాథులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదే ఊపుతో టార్గెట్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో లక్ష్యంగా తమ కార్యాచరణను మరింత వేగవంతం చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఆత్మావలోకనం అవసరం. మళ్లీ కెసిఆర్ ప్రజల దృష్టిలో నిప్పు కణికలా మారాలంటే సమూల మార్పులకు ..తనను తాను సంస్కరించుకునే స్థితిక రావాలి. అప్పుడు ప్రజలు కూడా చేరువవుతారు. పోయిన వైభవం వచ్చి చేరుతుంది. అందుకు కొంత సాహసం చేయాలి. ఆ సాహసం చేస్తారా లేక పాత సావాలసనే కొనసాగిస్తారా అన్నది కెసిఆర్ నిర్ణయంపైనే ఆధారపడి ఉంది.

## కార్పోరేటర్లే గ్రేటర్‌లో పునాది రాళ్లు
### వారితోనే మరింత పట్టుకు బిజెపి వ్యూహం

హైదరాబాద్,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ అగ్రనాయకులు తమ ప్రాంతాలలో పట్టు సాధించారు. దీంతో రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఆయా ప్రాంతాల్లో పట్టుకు వ్యూహాలు అనుసరించే అవకాశం ఏర్పడింది. ఇకపోతే మంత్రుల ప్రభావం ఆయా ప్రాంతాల్లో పెద్దగా కనిపించలేదు. దీంతో బిజెపికి కలిసివచ్చే అవకాశాలను మరింత పరిశీలించనుంది. ఆయా ప్రాంతాల్లో భవిష్యత్ వ్యూహానికి కార్పోరేటర్లు పునాదిగా మారనున్నారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో గెలుపొందిన వారితో ఇకముందు నేరుగా ప్రజలకు కలసుకుని బాగా బలపడాలని బిజెపి చూస్తోంది. ఇకపోతే అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం వరకు వ్యూహాత్మకంగా వ్యవహరించి, తమ అసెంబ్లీ సెగ్మెంట్లలో మంచి ఫలితాలు సాధించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ తన సొంత నియోజకవర్గమైన ముషీరాబాద్‌లో మెజారిటీ డివిజన్లలో కాషాయజెండా ఎగరడంలో కీలకంగా వ్యవహరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఇక్కడి నుంచి ఓటమి పాలయ్యారు. నియోజకవర్గంలో పట్టు నిలుపుకునేందుకు గ్రేటర్ ఎన్నికలను ఆయన సవాల్‌గా తీసుకున్నారు. దీంతో ముషీరాబాద్ నియోజకవర్గంలో ఆరు డివిజన్లు ఉండగా, ఐదు డివిజన్లను బీజేపీ కైవసం చేసుకుంది. ఇక్కడ కెసిర్ కూతురు కవిత ప్రచారం చేసినా ఫలితం దక్కలేదు. రాంనగర్, అడిక్‌మెట్, ముషీరాబాద్, కవాడిగూడ, గాంధీనగర్‌లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. గోషామహల్ గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన ఒకే ఒక నియోజకవర్గం. ఇక్కడ రాజాసింగ్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఈ నియోజకవర్గంలో ఆరు డివిజన్లు ఉండగా, ఐదు డివిజన్‌లలో బీజేపీ విజయం సాధించింది. మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహించిన ఖైరతాబాద్‌లోనూ బీజేపీ పట్టు సాధించింది. ఇక్కడ ఆరు డివిజన్లు ఉండగా, రెండు డివిజన్లలో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ ప్రాతినిధ్యం వహించిన చోట రెండు డివిజన్లలో విజయ కేతనం ఎగురవేసింది. అంబర్‌పేటలో బీజేపీ మూడు డివిజన్లను గెలుచుకుంది. సనత్‌నగర్‌లో మూడు డివిజన్లలో విజయం సాధించింది. అమీర్‌పేట, రాంగోపాల్‌పేట, మోండా డివిజన్లలో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. కార్వాన్ నియోజకవర్గంలోని ఏడు డివిజన్లలో రెండు డివిజన్లు బీజేపీ వశమయ్యాయి. రాజేంద్రనగర్‌లో మూడు డివిజన్లలో, కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఓ డివిజన్‌లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. గెలిచిన, గెలవని ప్రాంతాల్లో ఓట్ల శాతాన్ని ఎన్నికల కమిటీ పరిశీలించనుంది. వాటి ఆధారంగా భవిష్యత్ పునాదికి సిద్ధం అవుతోంది.

## ఇంతటి అధ్వాన్న పాలన గతంలో ఎప్పుడూ లేదు
### ప్రశ్నిస్తే సస్పెన్షన్లు చేసి పక్కదారి పట్టించారు: కాల్వ

అనంపురం,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): గతంలో ఎప్పుడూ ఇంత అధ్వాన్న పాలన చూడలేదని మాజీమంత్రి, టిడిపి నేత కాల్వ శ్రీనివాసులు అన్నారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో ప్రజలపై పన్నులు విధించడం తప్ప ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని ధ్వజమెత్తారు. అసెంబ్లీలో సమస్యలు చర్చిఏ ధైర్యం కూడా చేయలేక పోయారని అన్నారు. టిడిపి సభ్యులను సస్పెండ్ చేయడం మినహా వారు సాధించేదేమీ లేదన్నారు. జగన్ పాలనలో విద్యుత్, కరెంటు, పెట్రో ఛార్జీలు ఎన్నడూ లేని విధంగా విపరీతంగా పెంచారన్నారు. అయితే జగన్ సర్కారు నివాస గృహాలకు 0.1 నుంచి 0.5 వరకు, నివాసేతర ప్రాంతాలకు 0.2 నుంచి 2 శాతం వరకు పెంచే విధంగా చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. ఆదాయం కోసం ప్రభుత్వం ప్రతి ఏటా రిజిస్ట్రేషన్ విలువ పెంచుతోందన్నారు. కొత్త పన్నుల విధానం అమల్లోకి తెస్తే ప్రతి ఏటా ఆస్తి పన్ను విలువ పెరుగుతుందన్నారు. చార్జీల పెంపును నిరసిస్తూ శనివారం టీడీపీ ఆధ్వర్యంలో దీక్షలు చేపడుతున్నట్లు వివరించారు. చంద్రబాబుపై రాజకీయ కక్షతో హెరిటేజ్, చిన్న చిన్న ప్యారడైజ్‌లను దెబ్బతీసేందుకు ఏడాదికి 500 కోట్లు వడ్డీ కట్టి, 3 వేల కోట్లు అప్పు తెచ్చి అమూల్ సంస్థకు మౌలిక వసతులు కల్పిస్తున్నదని ఆరోపించారు. జగన్ నిర్ణయం వల్ల చిన్న చిన్న డెయిరీలు దెబ్బతింటున్నాయన్నారు. సమస్యలను అసెంబ్లీలో ప్రశ్నిస్తే టీడీపీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేస్తున్నారన్నారు. మంత్రులు పేర్నినాని, కొడాలినాని సిగ్గు లేకుండా అసభ్యంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కరోనా కారణంగా ప్రజాజీవితాలు తలకిందులయ్యాయని, ఇలాంటి పరిస్థితుల్లో పన్ను రద్దు చేయాల్సిందిపోయి పెంచడం దారుణమన్నారు. పన్నుల పెంపును ఉపసంహరించుకునేంత వరకు పోరాటాలు చేస్తామన్నారు.

## గ్రేటర్ ఊపులో సరికొత్త వ్యూహాలు
### ఖమ్మం,వరంల్ కార్పోరేషన్లపై దృష్టి

వరంగల్,డిసెంబర్5(ఆర్ఎన్ఎ):గ్రేటర్ ఊపులో ఉన్న బిజెపి నేతలు ఇక రానున్న వరంగల్ కార్పోరేషన్, ఖమ్మం స్థానాలపై దృష్టి సారించనున్నారు. ఇక్కడ అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలు అప్పుడే చర్చలు మొదలు పెట్టారు. దుబ్బాక తరవాత గ్రేటర్ వంటి వరుస విజయాలు పార్టీ శ్రేణుల్లో కదనోత్సా హం వెల్లివిరిస్తున్నది. దుబ్బాక ఉప ఎన్నిక, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అనూహ్య విజయాలను సొంతం చేసుకున్న బీజేపీ రాష్ట్రంలో ఇప్పుడు టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయశక్తిగా రూపొందామని సవాల్ విసురుతున్నది. 2022లోనే పార్లమెంట్‌కు, అసెంబ్లీకి జమిలి ఎన్ని కలు జరుగుతాయని ఊహాగానాలు వస్తున్న నేపథ్యంలో జిల్లాల్లో పట్టు బిగించేందుకు వ్యూహరచన చేయనున్నారు. ఊపుమీదున్న పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని రేకెత్తించే విధంగా రాబోయే రోజుల్లో విజయం సాధించేందుకు వీలుగా నిరంతరం ప్రజా సమస్యలపై ఉద్యమించే అవకాశాలు ఉన్నాయి. బండి సంజయ్ అధ్యక్షతన రాష్ట్రంలో ఘనవిజయాలు సాధిస్తున్న నేపథ్యంలో వచ్చే అసెంబ్లీ నాటికి జిల్లాల్లో పబలోపేతం కావాలన్న యోచనలో నేతలు ఉన్నారు. టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయ శక్తిగా రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో పార్టీని గెలిపిస్తే ముఖ్యమంత్రి పదవిని దక్కించుకునే అవకాశం ఉంటుందని పార్టీ వర్గాల్లో అప్పుడే చర్చ జరుగుతున్నది. రాబోయే రోజుల్లో జరిగే అన్ని ఎన్నికల్లోనూ పార్టీ విజయ పరంపర కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ స్థానం నుంచి పోటీ చేసిన బండి సంజయ్ టీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్ని కల్లో ఆయన కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కుడి భుజంగా వ్యవహరించే బోయినపల్లి వినోద్‌కుమార్‌పై 85 వేల పైచిలుకు ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. ఈ సందర్భంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో నాలిగింటిలో బీజేపీ టీఆర్ఎస్ కంటే ఎక్కువ ఓట్లను సాధించింది. ప్రస్తుతం ఉన్న వాతావరణంలో ఇప్పటి నుంచే నియోజకవర్గాలపై దృష్టిసారించి ప్రజా సమస్యలపై ఉద్య మాలు చేపడుతూ పట్టు బిగించాలని బీజేపీ భావిస్తున్నట్లు తెలిసింది. పార్టీని బలమైన శక్తిగా తీర్చిదిద్దేందుకు ఆయన వ్యూహాత్మకంగా ముందుకు సాగుతారని చెబుతున్నారు. 2021 ఆరంభం నుంచే బీజేపీ తన రాజకీయ కార్యకలాపాలను ముమ్మరం చేయనున్నదని సమాచారం.

# ఎదుటి వారి వైఫల్యాలే రాళ్లుగా పునాది

### ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో విజయం
### బిజెపి ఎదుగుదలకు అదే వ్యూహం

హైదరాబాద్,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): రాజకీయాల్లో ఎదుటి వారి వైఫల్యాలను ఎండగట్టగలిగితే..తాము అందుకు ప్రత్యామ్నాయం అని చెప్పగలిగితే విజయం సాధించవచ్చని బిజె ఇనిరూపించింది. తెలంగాణలో ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయి. తెలంగాణ ఉద్యమానికి పూర్తి మద్దతు పలకడమే గాకుండా, ప్రత్యేక తెలంగాణ ఏర్పడడంలో బిజెపి కీలకభూమిక పోషించింది. కేంద్రంలో తెలంగాణ రావడానికి తనవంతుగా పెద్ద కృషిని చేసింది. తెలంగాణ ప్రజలకు అండగా ఉండి నడిచింది. ఇవన్నీ కూడా ప్రజలకు ఇంకా బగా గురుతు. వాటిని కాదనడానికి లేదు. అయితే తెలంగాణ ఏర్పడ్డ తరవాత పరిస్థితులు కెసిఆర్‌కు అనుకూలంగానే ఉన్నాయి. కానీ రానురాను అవి శృతిమించి పాలన అన్నది కటుంబానికి కేంద్రంగా మారడంతో బిజెపి దానిని అందిపుచ్చుకుని..కుటుంబ పాలనపైనే ప్రధానంగా దృష్టి సారించింది. ప్రజలు కూడా కెసిఆర్ కుటుంబ పాలనపై విసుగుతో ఉన్నారు. దుబ్బాకలో విజయం, గ్రేటర్‌లో ప్రతికూల ఫలితాలకు ఇవి బాగా దోహదపడ్డాయి. ఇదే అదనుగా బీజేపీ అనుసరించిన వ్యూహం, ప్రత్యేక కార్యాచరణ ఫలితాలను ఇచ్చింది. ప్రతి నియోజకవర్గానికి ఒక ఇన్‌చార్జిని నియమించి బాధ్యతలను అప్పగించి పనిచేయించి, కెసిఆర్ కుటుంబ పాలనపైనే ఎలుగెత్తి చాటింది. పార్టీ కమిటీలు, పార్టీ శ్రేణులు బీజేపీ గెలుపు కోసం విశేషంగా కృషి చేయడం ఒక ఎత్తయితే కుటుంబపాలన, గడీల పాలన అన్న నినాదాలు బాగా పినచేశాయి. అలాగే ఎంఐఎంతో ఉన్న దోస్తానా కూడా మెజార్టీ హిందువవుల్లో తీవ్ర వ్యతిరేకతను తీసుకుని వచ్చాయి. ఇవన్నీ కూడా బలంగా తీసుకుని వెళ్లడంలో బిజెపి వ్యూమాత్మకంగా పనిచేసింది. రోడ్‌షోలు, బస్సుయాత్రలతో ప్రచారం నిర్వహించి ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. బిజెపి జాతీయ అధ్యక్షుడు నడ్డా హైదరాబాద్ వచ్చిన సందర్భంగా కటుంబ పాలన, అవినీతికి తాము వ్యతిరేకమని, తమ పోరాటం దీనిపైనే అని అన్నారు. అన్నట్లుగానే అవి ఆలంబనగా చేసుకుని కెసిఆర్‌పై బిజెపి మలి విజయం సాధించింది. ఇకపోతే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేను విజయతీరాలకు చేర్చిన భూపేంద్ర యాదవ్‌ను జీహెచ్ఎంసీ ఎన్నికల ఇన్‌చార్జిగా నియిమించారు. పార్టీ ముఖ్య నేతలు ప్రచారంలో మాట్లాడాల్సిన అంశాలను కూడా భూపేంద్రయాదవ్ సూచనల మేరకు రూపొందించి అమలు చేయడం కలిసొచ్చింది. వరదసాయం, కుటుంబ పాలన, హిందూ అనుకూల నినాదాలు, ఎంఐఎం మతతత్వం తదితర అంశాలను ప్రచారంలో ఈటెల్లా వాడారు. అలాగే వివిధ కుల, విద్యార్థి, యువజన సంఘాలతో సమావేశాలు కూడా బీజేపీ అభ్యర్థుల గెలుపునకు దోహద పడ్డాయి. మాజీమంత్రి డీకే అరుణను బీజేపీ జాతీయ ఉపాధ్యక్షు రాలిగా నియమించడం ద్వారా ఆ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పకనే చెప్పింది. బీసీ సామాజిక వర్గాల్లో గౌడ్, యాదవ, మున్నూరు కాపులతోపాటు ఇతర సామాజిక వర్గాలను కూడా కలుపుకుని పనిచేయడం కలిసివచ్చింది. టీఆర్ఎస్ ఎంఐఎం మధ్య అవగాహన ఉందని యువత మెదళ్లలోకి ఎక్కించ డంలో బండి సంజయ్ సఫలమ య్యారు. పాతబస్తీపై సర్జికల్ స్ట్రయిక్స్ చేస్తామని, అక్రమంగా వలన వచ్చిన వారిని, రోహింగ్యాలను ఏరివేస్తామని చెప్పడం వారిని బీజేపీ వైపు మళ్లించింది. మొత్తంగా బిజెపి వ్యూహాలు ఫలించడంలో బండి సంజయ్ కూడా బాగా కష్టపడ్డారని చెప్పాలి. బండిని అధ్యక్షుడిగా చేయడంతో ఆయన నేరుగా కెసిఆర్ ఫ్యామిలీ లక్ష్యంగా తన దుందుడుకు స్వభావాన్ని చాటారు.

ఓ వైపు దుబ్బాక విజయం.. మరోవైపు జీహెచ్ఎంసీలో అత్యధిక స్థానాలు గెలుపొందడంతో బీజేపీ ఇప్పుడు సహజంగానే రానున్న అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి సారించింది. అదే వ్యూమంలో పడింది. ఈ విజయాలే సోపానాలుగా, ఈ ఎన్నికల్లో పని చేసిన తీరునే స్ఫూర్తిగా ముందుకుసాగాలని నిర్ణయించింది. రాష్ట్ర పార్టీ నేతలంగా ఇదే ఐక్యతతో మరో మూడేళ్లలో జరగనున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేయాలని నిర్ణయించారు. తద్వారా పార్టీని అధికారంలోకి తేవచ్చన్న లక్ష్యంతో కార్యాచరణ ప్రణాళికల అమలును వేగవంతం చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. ఆరేళ్లలో హైదరా బాద్ అభి వృద్ధి విషయంలో టీఆర్ఎస్ ఇచ్చిన హామీలు, వాటి అమలులో వైఫల్యాలను బీజేపీ ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సక్సెస్ అయింది. ఉద్యోగులు, నిరుద్యోగుల్లో టీఆర్ఎస్ పట్ల ఉన్న వ్యతిరేకత తమకు కలసి వచ్చేలా బీజేపీ చేసుకోగలిగింది. బ్యాలెట్ ఓట్లు 83 డివిజన్లలో భారతీయ జనతా పార్టీకి అత్యధికంగా రావడమే ఇందుకు నిదర్శనం. వరద సాయం పంపిణీ, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల విషయంలో టీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టడంతో బీజేపీ సక్సెస్ అయింది. అలాగే సోషల్ మీడియాలో కూడా బీజేపీ వ్యతిరేకప్రచారాన్ని బలంగా తిప్పికొట్టగలిగింది. టిఆర్ఎస్‌కు తామే ప్రత్యామ్నాయం అని చాటింది.

# ఆసక్తిగా మారిన మేయర్ సీటు మలుపులు

### కీలకం కానున్న ఎంఐఎం ఎత్తుగడలు
### ఎంఐఎంతో జతకట్టకుండా టిఆర్ఎస్‌కు చాన్స్ లేనట్లే
### అదే జరిగితే బిజెపికి అస్త్రం దొరికినట్లే

హైదరాబాద్,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): మతతత్వ ఎంఐఎంతో అధికార టిఆర్ఎస్ కుమ్మక్కయ్యిందని ప్రచారం చేసిన బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్... ఇప్పుడు టిఆర్ఎస్ వ్యూహాలను గమనించే పనిలో పడ్డారు. నగర మేయర్ పీఠం దక్కించుకోవాలంటే టిఆర్ఎస్‌కు ఎంఐఎం సాయం తప్పనిసరి. ఒంటరిగా పీఠం దక్కించుకోవడం అసాధ్యం. ఎంఐఎంతో పొత్తు లేదన్న టిఆర్ఎస్ ఇప్పుడు దీనిని ఎలా సాధిస్తుందని బిజెపి చూస్తోంది. మరోవైపు ముఖ్యమంత్రి కేసీఆర్ బీజేపీని ఎదుర్కోగలిగిన సమర్థ నాయకుడని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన ప్రకటన ఇప్పుడు గ్రేటర్ కోసం కలిసి పనిచేస్తుందన్న సంకేతాలు ఇస్తోంది. ఆయన సమర్థంగా పాలిస్తున్నారని, కొన్ని సీట్లు పోయినంత మాత్రాన రాజకీయంగా ఆలోచించాల్సిన అవసరం లేదని ఓవైసీ వ్యాఖ్యానించారు. సీఎం దక్షిణ భారతదేశంలోనే భవిష్యత్తు ఉన్న నాయకుడని కూడా కొనియాడారు. కేసీఆర్‌ను తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచి చూస్తున్నానని చెప్పారు. ఇకపోతే బిజెపికి చెందిన కార్పోరేటర్లను లాక్కోవడం అంత ఈజీ కాదు. కాంగ్రెస్‌కు ఉన్న ఇద్దరు కార్పోరేటర్లను లాక్కున్నా లాభం లేదు. అనివార్యంగా ఎంఐఎంతో కలసి వెళ్లాల్సిందే. అయితే కెసిఆర్ వ్యూహమేవిటన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది. జిహెచ్ఎంసి ఎన్నికల ఫలితాలు ఏ ఒక్క రాజకీయపార్టీకి పూర్తి మెజారిటీని అందించలేదు. హంగ్ పరిస్థితి ఏర్పడడంతో ఇప్పుడు అంతా తలలు పట్టుకుంటున్నారు. బిజెపి మాత్రం తాము ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని తెలిపింది. ఈ దశలో టిఆర్ఎస్ ముందున్న ఏకైక ప్రత్యామ్నాయం మజ్లిస్ సాయం తీసుకోవడమే. గతంలో నాలుగు స్థానాలు మాత్రమే ఉన్న భారతీయ జనతాపార్టీ ఈ సారి నలభై ఎనిమిది గెలుచుకుని టిఆర్ఎస్‌కు నిద్రలేకుండా చేసింది. నామమాత్రపు ఆధిక్యం కలిగి 56 డివిజన్లతో అతిపెద్ద పార్టీగా నిలిచిన తెలంగాణ రాష్ట్రసమితికి, ఎక్స్ అఫిషియో సభ్యులను కలుపుకున్నా అధికారానికి దూరంగానే ఉండాల్సిన దుస్థితలో ఉంది. నలభై నాలుగు సీట్లతో బలంగా ఉన్న మజ్లిస్ మద్దతు తీసుకోవచ్చు కానీ అందులో అనేక సమస్యలున్నాయి. మేయర్ ఎన్నిక కోసం జరగవలసి వచ్చే విన్యాసాలు, తెరవెనుక తెర ముందు కుదరవలసిన అవగాహనలు– రానున్న రోజులలో ఆసక్తికరమైన సన్నివేశంగా పరిణమించనున్నాయి. స్పష్టంగా చెప్పుకోవాలంటే, ఇది తెలంగాణ రాష్ట్రసమితి ఆధిపత్యానికి గండిలా భావించాలి. ఏదో రకంగా సాంకేతికంగా మేయర్ పీఠాన్ని పొందవచ్చును కానీ, వాస్తవంలో మాత్రం ఆ పార్టీ అనుభవంలో ఉన్న సంపూర్ణ అధికారం ఇప్పుడు జారిపోయిందనే చెపుకోవాలి. ప్రభుత్వం పనితీరు మీద కావచ్చు, ప్రభుత్వాధినేత వైఖరుల మీద కావచ్చు హైదరాబాద్ ప్రజలకు తీవ్రమైన ఆగ్రహం కలిగింది. దాన్ని వ్యక్తం చేయడానికి ఒక అవకాశం లభించింది. ప్రత్యామ్నాయంగా ఎంచుకోవడానికి ఒక రాజకీయపక్షమూ కనిపించింది. దాని పర్యవసానమే ఈ ఫలితం. ఇది కేవలం భారతీయ జనతాపార్టీకి సానుకూల ఓటు కాదని టిఆర్ఎస్‌కూ తెలుసు. బిజెపికి ముందునుంచీ నగరంలో గట్టి పునాది ఉన్నది. కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు. కానీ, నగరమంతా విస్తరించిన నిలకడైన ప్రజాబలం లేదు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత బిజెపి సానుభూతిపరులు కూడా టిఆర్ఎస్‌కు దగ్గరయ్యారు. బిజెపికి ఉన్న పరిమిత బలానికి, ఆ పార్టీ పరిశ్రమ, ప్రభుత్వ వ్యతిరేకత తోడయింది. మళ్లీ కార్యకర్తలు బండి రాకతో వెంట నడిచారు. ఈ ఫలితం బిజెపికి బల్దియా కుర్చీని ఇవ్వలకపోయినా పునాది వేశాయి. రాష్ట్రంలో టిఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ప్రజలు దీవించారు. అలాగే ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక చేశారు. మధ్య తరగతి వారు నివసించే ప్రాంతాలు, తెలంగాణ జిల్లాల నుంచి స్థిరపడినవారి నివాసప్రాంతాలలో భారతీయ జనతాపార్టీకి బాగా ఆదరణ లభించింది. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి, ప్రభుత్వ ఉద్యోగులు, చిన్న వ్యాపారులు– ప్రభుత్వం మీద కోపంగా ఉన్నట్టు, బిజెపిని వారు ప్రత్యామ్నాయంగా చూసినట్టు ప్రాథమిక విశ్లేషణలు సూచిస్తున్నాయి. ప్రజలకు, ప్రజాప్రతినిధులకు అందుబాటులో లేని నాయకుడి మీద క్రమంగా విముఖత ఏర్పడుతుంది. నేరుగా విమర్శించడానికి ఆస్కారం లేని నిర్బంధ వాతావరణంలో ప్రజలు విధేయులుగానే కనిపిస్తారు. అవకాశం దొరికినప్పుడు మాత్రం గట్టి దెబ్బ తీస్తారు. బహుశా ఇప్పుడు అదే జరిగిందన్న విశ్లేషణలు వస్తున్నాయి. ఏదేమైనా నగరపాలక మేయర్ పీఠం రాజకీయాలు ఎటు తిరగుతాయన్నది ఆసక్తిగా మారింది.

## 200 కిలోల గంజాయి స్వాధీనం.. ముగ్గురు అరెస్ట్




సూర్యాపేట, డిసెంబర్ 5: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన సూర్యాపేటలో శనివారం చోటుచేసుకుంది. నిందితుల వద్ద నుండి 200 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ భాస్కరన్ వివరాలు వెల్లడించారు. మద్దిరాల మండలం తూర్పుగూడ నుండి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో జిల్లా టాస్క్‌ఫోర్స్, మద్దిరాల పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులు ఇన్నోవా వాహనంలో గంజాయిని తరలిస్తుండగా గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు.

## కరోనా టీకా ట్రయల్స్ వేసుకున్నా ఆగని కరోనా
### హర్యానా ఆరోగ్య శాఖ మంత్రికి పాజిటివ్ నమోదు

న్యూఢిల్లీ,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): హర్యానా ఆరోగ్యశాఖ మంత్రి అనిల్ విజ్ కొన్ని రోజుల క్రితం కరోనా వైరస్ టీకా ట్రయల్స్‌లో భాగంగా టీకాను వేయించుకున్నారు. అయితే ఆ మంత్రికి వైరస్ సోకింది. ఉదయం తన ట్విట్టర్‌లో మంత్రి అనిల్ విజ్ ఈ విషయాన్ని తెలిపారు. కోవిడ్19 పరీక్షలో పాజిటివ్ తేలినట్లు ఆయన వెల్లడించారు. వాస్తవానికి నవంబర్ 20వ తేదీన మంత్రి అనిల్.. కోవాగ్జిన్ టీకాను తీసుకున్నారు. అంబాలా హాస్పిటల్‌లో జరిగిన మూడవ దశ ట్రయల్స్‌లో భాగంగా మంత్రి అనిల్ విజ్.. వాలంటీర్ రూపంలో వ్యాక్సిన్ తీసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన భారత్‌బయోటెక్ సంస్థ కోవాగ్జిన్ టీకాను అభివృద్ధి చేస్తున్న విషయం తెలిసిందే.

## మరోమారు పెరిగిన బంగారం,వెండి ధరలు
### అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం అంటున్న వ్యాపారులు

న్యూఢిల్లీ,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): బంగారం ధర జిగేల్ మంటోంది. తగ్గినట్లే తగ్గి మళ్లీ పెరుగుతోంది. వేలల్లో పెరుగూత వందల్లో తగ్గుతోంది. దీంతో పసిడి ధర పరుగులు పెడుతూనే వస్తోంది. బంగారం ధర శనివారం కూడా పైపైకి కదిలింది. బంగారం కొనుగోలు చేయాలని భావించే వారికి ఇది బ్యాడ్ న్యూస్ అని చెప్పొచ్చు. బంగారం ధర పెరిగితే వెండి ధర కూడా ఇదే దారిలో నడిచింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర పెరుగుదల నేపథ్యంలో దేశీ మార్కెట్‌లోనూ ధరలు పెరిగాయని బులియన్ మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. హైదరాబాద్ మార్కెట్‌లో శనివారం బంగారం ధర పెరిగింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.220 పైకి కదిలింది. రూ.50,290 చేరింది. అదేసమయంలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర కూడా ఇదే దారిలో నడిచింది. రూ.200 పెరుగుదలతో రూ.46,100కు ఎగసింది. బంగారం ధర పెరిగితే.. వెండి ధర కూడా ఇదే దారిలో నడిచింది. రూ.200 పెరిగింది. దీంతో వెండి ధర రూ.67,500కు చేరింది. పరిశ్రమ యూనిట్లు, నాణెళిపు తయారీదారుల నుంచి డిమాండ్ పుంజుకోవడం ఇందుకు ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా బంగారం ధర జిగేల్ మంది. బంగారం ధర ఔన్స్‌కు 0.05 శాతం పెరుగుదలతో 1842 డాలర్లకు చేరింది. బంగారం ధర పెరిగితే వెండి ధర కూడా ఇదే దారిలో పయనించింది. వెండి ధర ఔన్స్‌కు 0.74 శాతం పెరుగుదలతో 24.31 డాలర్లకు చేరింది. ఇకపోతే బంగారం ధరపై ప్రభావం చూపే అంశాలు చాలానే ఉన్నాయి. ద్రవ్యోల్బణం, గ్లోబల్ మార్కెట్ పసిడి ధరల్లో మార్పు, కేంద్ర బ్యాంకుల వద్ద ఉన్న బంగారం నిల్వలు, వడ్డీ రేట్లు, జువెలరీ మార్కెట్, భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య యుద్ధాలు వంటి పలు అంశాలు పసిడి ధరపై ప్రభావం చూపుతాయి.

## వ్యవసాయ చట్టాలను రద్దు చేయాల్సిందే
### తమిళనాట డిఎంకె ఆందోళన

చెన్నైన్యూఢిల్లీ,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలపై వ్యతిరేకత రోజురోజుకు పెరిగిపోతున్నది. వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఇప్పటికే పంజాబ్ రైతులు ఢిల్లీ శివార్లలో ఆందోళన చేస్తున్నారు. వారికి బెంగాల్ సీఎం మమతాబెనర్జి, రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ మద్దతు తెలిపారు. అంతేగాక వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ పంజాబ్, కేరళ రాష్ట్రాలు కోర్టులను ఆశ్రయించాయి. తాజాగా తమిళనాడులో ప్రతిపక్ష డీఎంకే కూడా వ్యవసాయ చట్టాలపై నిరసన వ్యక్తంచేసింది. ఆ చట్టాల రద్దును కోరుతూ కోర్టుకు వెళ్లనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు వివాదాస్పద వ్యసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ శనివారం ఉదయం సాలెంలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి రైతులు భారీ సంఖ్యలో హాజరై కేంద్ర చట్టాలపై తమ వ్యతిరేకతను చాటిచెప్పారు. ఈ ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించిన స్టాలిన్.. 'కేంద్ర చేసిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా తాము కోర్టుకు వెళ్తాం. ఈ విషయంలో కేరళ, పంజాబ్ రాష్ట్రాలు ఇప్పటికే కోర్టు మె÷–లటెక్కాయి. మన ముఖ్యమంత్రి పళనిస్వామి తాను రైతు బిడ్డనని చెప్పుకుంటున్నాడు. అయితే, ఆయన ఇంతవరకు ఎందుకు వ్యవసాయ చట్టాలపై ఎలాంటి చర్య తీసుకోలేదని ప్రశ్నించారు.

## గద్వాల విజయలక్ష్మికి మంత్రి అభినందన



హైదరాబాద్,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ, ఎంపీ కేశవరావును నగరంలోని బంజారాహిల్స్‌లో గల ఆయన నివాసంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బంజారాహిల్స్ డివిజన్ కార్పోరేటర్‌గా గెలిచిన కేకే కూతురు గద్వాల విజయలక్ష్మికి మంత్రి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బంజారాహిల్స్ డివిజన్ టీఆర్ఎస్ ఇంచార్జ్ గా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి బాధ్యతలు నిర్వర్తించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మాజీ డీసీసీబీ చైర్మన్ రాంకిషన్ రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు అల్లోల సురేందర్ రెడ్డి తోపాటు లక్ష్మణచాంద మండల నాయకులు ఉన్నారు.

## వడ్డీ రేట్లను మార్చని రిజర్వ్ బ్యాంక్

### వరుసగా మూడోసారి యథాతథంగా పరపతి విధానం

ముంబై,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): వడ్డీరేట్లలో ఎలాంటి మార్పు లేకుండానే ఆర్‌బిఐ పరపతి విధానం కొనసాగింది. రివర్స్ రెపో రేటు 3.35 శాతంగా ఉంది. బ్యాంకు రేటు 4.25 శాతంగా కొనసాగనుంది. ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్బీఐ శుక్రవారం ప్రకటించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరుసగా మూడోసారి కీలక వడ్డీ రేట్లలో మార్పులు చేయలేదు. ద్రవ్యోల్బణం పెరగడం, జీడీపీ ప్రతికూలంగానే ఉండటం వంటి వివిధ కారణాలతో ఆర్బీఐ రెపో రేటును యథాతథంగా నాలుగు శాతంగా ఉంచింది. ద్వైపాక్షిక పరపతి విధాన సమీక్షలో భాగంగా ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలో ఎంపీసీ మూడు రోజులపాటు సమావేశమైంది. ఇందులో భాగంగా యథాతథ పాలసీ అమలుకే కట్టుబడుతున్నట్లు ఏకగ్రీవంగా ప్రకటించింది. దీంతో రెపో రేటు నాలుగు శాతం వద్ద, రివర్స్ రెపో రేటు 3.35 శాతం వద్ద కొనసాగనుంది. 20202÷-ఖ1 ఆర్థిక సంవత్సరానికి గాను జీడీపీపై తొలుత వేసిన మైనస్ 9.5 శాతం క్షీణత అంచనాలను తాజాగా సవరించింది. మైనస్ 7.5 శాతంగా అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెరడో అర్ధ సంవత్సరం అక్టోబర్‌మ్యార్చి కాలంలో ఆర్థిక వ్యవస్థ సానుకూలవద్ధిని సాధించనుందని భావించింది. డిసెంబర్ త్రైమాసికంలో వద్ధి 0.1 శాతంగా ఉండవచ్చునని భావిస్తోంది. అంతకుముందు మైనస్ 5.6 శాతంగా అంచనా వేసింది. మార్చి త్రైమాసకం వద్ధి రేటు అంచనాలను 0.7 శాతం నుండి 0.7 శాతానికి పెంచింది. బ్యాంకింగ్ రంగంలోకి కార్పొరేట్ సంస్థలకు అనుమతివ్వడం భారతీయ రిజర్వు బ్యాంకు అభిప్రాయం కాదని గవర్నర్ శక్తికాంతదాస్ అన్నారు. అది కేవలం కేంద్ర బ్యాంకు అంతర్గత కమిటీ అభిప్రాయమని స్పష్టం చేశారు. నిపుణులు, ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించాకే తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. కొత్త బ్యాంకులు పెట్టేందుకు కార్పొరేట్లకు అనుమతి ఇవ్వాలని ఆర్‌బీఐ అంతర్గత కమిటీ కొన్నిరోజుల క్రితం అభిప్రాయం వెలుబుచ్చింది. ప్రైవేటు రంగ బ్యాంకుల్లో మూలధనం, బ్యాంకింగ్ చట్టంలో మార్పులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు బ్యాంకులుగా మారడం గురించి పలు సూచనలు చేసింది. అయితే కార్పొరేట్లకు అనుమతి ఇవ్వాలన్న సూచనలపై నిపుణులు, ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. బ్యాంకింగ్ రంగంపై ఇదొక పిడుగుపాటని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్, డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య అభ్యంతరం వ్యక్తం చేశారు.'అది ఆర్‌బీఐ అంతర్గత కమిటీ ఇచ్చిన నివేదిక. దానినే ఆర్‌బీఐ తుది నిర్ణయం లేదా అభిప్రాయంగా పరిగణించొద్దు. ఇదైతే మీరు అర్థం చేసుకోవాలి. కమిటీ చెప్పిన సూచనలపై కేంద్ర బ్యాంకు ఇంకా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదు. ప్రజాభిప్రాయం స్వీకరించాకే ఆర్‌బీఐ తుది నిర్ణయం తీసుకుంటుంది' అని శక్తికాంత దాస్ స్పష్టం చేశారు.

## పిన్ లేకుండానే రూ.5 వేల వరకు లావాదేవీలు!

న్యూఢిల్లీ,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కస్టమర్లకు గుడ్‌న్యూస్ చెప్పింది. కాంటాక్ట్‌లెస్ కార్డ్ ట్రాన్సాక్షన్ల పరిమితిని వచ్చే జనవరి 1 నుంచి రూ.2000 నుంచి రూ.5000కు పెంచుతున్నట్లు వెల్లడించింది. ప్రస్తుత కరోనా కాలంలో డిజిటల్ పేమెంట్స్ మరింత సురక్షిత వాతావరణంలో జరగాలన్న ఉద్దేశంతో పరిమితిని పెంచినట్లు ఆర్బీఐ చెప్పింది. టెక్నాలజీ వినియోగం ఎక్కువ కావడంతో కాంటాక్ట్‌లెస్ కార్డ్ ట్రాన్సాక్షన్లు, యూపీఐ పేమెంట్లు పెరిగిపోయాయని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. ఇవి డిజిటల్ పేమెంట్లను మరింత సురక్షిత వాతావరణంలో జరిగేలా చూస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. కాంటాక్ట్‌లెస్ ట్రాన్సాక్షన్ల పరిమితి అధికారాన్ని కూడా ఈ మధ్యే కస్టమర్లకు కట్టబెట్టారు. తాజా పరిమితి పెంపుపై కూడా కస్టమర్‌కే విచక్షణాధికారం ఉంటుందని శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. ఇక రానున్న రోజుల్లో భారీ మొత్తాల లావాదేవీల కోసం ఉపయోగించే రియల్ టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్ (ఆర్టీజీఎస్)ను 24 గంటలూ అందుబాటులో ఉంచేలా చేస్తామని కూడా ఆర్బీఐ ప్రకటించింది. ఇప్పటికే గతేడాది డిసెంబర్ నుంచి నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్) 24 గంటలూ అందుబాటులోకి వచ్చింది.

### మొన్న దుబ్బాక.. నేడు గ్రేటర్..

## నాలుగు కాస్తా నలభై!

### తెలంగాణలో బలపడుతున్న బీజేపీ

### టీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయంగా అడుగులు

హైదరాబాద్,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): అసెంబ్లీలో ఒక్క సీటు. పార్లమెంటు ఎన్నికల్లో నాలుగు స్థానాలు. దుబ్బాక ఉప ఎన్నికల్లో విజయం. తాజాగా గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో ఇరవైకి పైగా డివిజన్లలో గెలుపు. ఇది చాలదూ బీజేపీ తెలంగాణలో బలపడుతుంది అని చెప్పడానికి. అవును. బీజేపీయే ఇప్పుడు టీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయంగా మారింది. ప్రజలు కూడా అదే భావించారు. అందుకే కాంగ్రెస్‌ను వెనక్కు నెట్టి టీఆర్ఎస్ తర్వాత అత్యధిక స్థానాల్లో బీజేపీని గెలిపించారు. నిజానికి బీజేపీకి తొలి నుంచి హైదరాబాద్ లో పట్టు ఉండేది. ఆలే నరేంద్ర, బద్దం బాలిరెడ్డి వంటి నేతలు బీజేపీకి హైదరాబాద్ లో ఫౌండేషన్ వేశారు. అప్పటి నుంచి అసెంబ్లీ సీట్లను గెలుస్తూ వచ్చింది. గత ఎన్నికల్లో బీజేపీ టీడీపీతో కలసి 45 స్థానాల్లో పోటీ చేసి నాలుగు స్థానాల్లో విజయం సాధించింది. అయితే ఈసారి ఒంటరిగా పోటీకి దిగింది. జనసేనను కూడా పక్కన పెట్టి తానే అన్ని స్థానాల్లో పోటీ చేసింది. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి బీజేపీ మేయర్ సీటును తన్నుకుపోతుందని ఎవరూ అంచనా వేయలేదు. గతంలో కంటే బలం పెంచుకుంటుందన్న విశ్లేషణలే వెలువడ్డాయి. బీజేపీ నేతలు కూడా ఆ దిశగానే పోరాటం చేశారు. అధికారంలోకి రాకపోయినా బీజేపీ హైదరాబాద్ లో విజయం సాధించినట్లే. అయితే బీజేపీ నేతలు చేసుకున్న స్వయంకృతాపరాధం కారణంగా కొన్ని సీట్లు చేజారిపోయాయి ప్రస్తుతం తేలింది. ఎంఐఎం టార్గెట్ చేసే పొందిన ఓట్లను కొల్లగొట్టడంలో బీజేపీ పూర్వాం పెద్దగా ఫలించలేదు. రెచ్చగొట్టే వ్యాఖ్యల కారణంగా తటస్థులు బీజేపీ వైపు చూడలేకపోయారు. అలాగే సెటిలర్లు కూడా కొంత భయపడి బీజేపీ వైపు మొగ్గు చూపలేదు. ఏపీ రాజధాని అమరావతి అంశంలో బీజేపీ అనుసరిస్తున్న వైఖరి కూడా ఇక్కడ ఓక సామాజికవర్గం ఆ పార్టీకి దూరమయ్యిందని అంచనా. మొత్తం మీద ఎన్నికల ఫలితాలను చూస్తే పరిణతి పోయిందేమో లేదు. జరిగే నష్టమూ లేదు. ఒక్క ప్రతి సీటు రానున్న కాలానికి విజయానికి మెట్లుగానే బీజేపీ నేతలు చెబుతున్నారు.

## అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్‌కు గట్టి ఎదురుదెబ్బ

### ఉగ్రవాద ప్రేరేపణ రంగును బయటపెట్టిన భారత్

న్యూఢిల్లీ,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): రోజు రోజుకి ఉగ్రవాదులను ప్రేరేపిస్తూ వాస్తవాదీన రేఖ వెంబడి దాడులకు పాల్పడుతున్న పాకిస్థాన్ పై భారత్ సత్య దేశాలకు వివరించింది. అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఉగ్రవాద విషయంలో పాకిస్థాన్ అసలు రంగును భారత్ మరోసారి బయటపెట్టింది. పాక్ ప్రభుత్వంలో మార్పు వచ్చినప్పటికీ దక్షిణాసియా దేశాల్లో శాంతి స్థాపనకు విఘాతం కలిగిస్తూనే ఉంది. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ పాక్ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని భారత వేదికగా భారత్ సత్య దేశాలకు మరోసారి వివరించింది. ఐక్యరాజ్య సమితి సాధారణ అసెంబ్లీలో 'కల్చర్ ఆఫ్ పీస్' అనే అంశంపై చర్చ జరిగింది. ఐరాస శాశ్వత మిషన్‌లో భారత తరపున తొలి కార్యదర్శి ఆశిశ్ శర్మ ఈ చర్చల్లో పాల్గొని ప్రసంగించారు. తీవ్రవాదులకు ఆశ్రయం కల్పించే పాకిస్థాన్ నిత్యం భారత్‌పై ఉగ్రవాద చర్యలకు పాల్పడుతుందని తెలిపారు. భారత్‌లో కొంద్రు పావులుగా వాడుకొని పాక్ ఉగ్రకార్యకలాపాలకు పాల్పడుతోందని ఆరోపించారు. పాకిస్థాన్ వ్యవహారిస్తోందని వెల్లడించారు. పాకిస్థాన్ మత విద్వేషాలను రెచ్చగొడుతూ, సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహించటం దక్షిణాసియా దేశాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా శాంతికి విఘాతం కలిగిస్తుందని ఆయన ఆరోపించారు. ఇందువల్ల దక్షిణాసియాలో శాంతికి భంగం కలిగిస్తుందని తెలిపారు.

## బసవతారకం ఆస్పత్రికి ప్రత్యేక అవార్డు

### మరిన్ని సేవలకు అవకాశం వచ్చిందన్న బాలకృష్ణ

హైదరాబాద్,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): కరోనా సమయంలో అందించిన సేవలకు గుర్తింపుగా బసవతారకం హాస్పిటల్ ప్రత్యేక అవార్డుకు ఎంపికైంది. ఢిల్లీ రీసెర్చ్ సంస్థ ఇచ్చిన బసవతారకం హాస్పిటల్‌కు బెస్ట్ కోవిడ్ వారియర్ అవార్డుకు ఎంపిక చేశారు. దీనిపై సంస్థ చైర్మన్ బాలకృష్ణ స్పందించారు. ఈ అవార్డు ప్రోత్సాహంతో తాము మరిన్ని సేవలు అందించే ప్రేరణ కలిగిందని పేర్కొన్నారు. నిరుపేద వైద్యం కోసం 35శాతం రూపాయలు ట్రస్ట్ ఖర్చుచేస్తుందని బాలకృష్ణ తెలిపారు. మన హాస్పిటల్‌కు 62 ఉత్తమ క్యాన్సర్ హాస్పిటల్ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. 2011లో ఉత్తమ హాస్పిటల్ అవార్డు రాగా 13వ స్థానం లభించింది. 2020 నాటికి 62 స్థానానికి చేరుకున్నామన్నారు. దీనిని మెరుగు స్థానానికి తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నాం. అధునాతన పరికరాలతో, అంతర్జాతీయ ప్రమాణాలతో బసవతారకం హాస్పిటల్ సేవలు అందిస్తుందని బాలకృష్ణ పేర్కొన్నారు.

# కొత్త కార్పొరేటర్లకు రెండు నెలల ఎదురుచూపు

### ఫిబ్రవరి 10 వరకు వేచిచూడక తప్పని స్థితి

హైదరాబాద్,డిసెంబరు5(ఆర్ఎన్ఎ): ప్రస్తుత జీహెచ్ఎంసీ పాలక వర్గానికి వచ్చే ఏడాది ఫిబ్రవరి 10వ తేదీ వరకు గడువు ఉంది. సాధారణంగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించినా పాత పాలకవర్గం పదవీ కాలం పూర్తయ్యే వరకు కొత్త వారు పదవీ బాధ్యతలు తీసుకునేందుకు అవకాశం లేదు. దీంతో కొత్త కార్పొరేటర్లు ఫిబ్రవరి 11వ తేదీ తర్వాతే బాధ్యతలు స్వీకరించాల్సి ఉంటుంది. అసెంబ్లీలో ముదంస్తు ఎన్ఇనకల ఫలితం బాగా కలసి వచ్చినా ..అదే వ్యూమం గ్రేటర్‌లో మా÷-తరం బెడిసి కొట్టింది. ముందస్తు వ్యూహంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన టిఆర్ఎస్ జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మాత్రం చేదు ఫలితాన్ని చవిచూసింది. గ్రేటర్ ఎన్నికలను అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే తుది ఫలితం మినహా అనేక విషయాల్లో సారూప్యత కనిపిస్తుంది. గత అసెంబ్లీకి గడువు 2019 ఏప్రిల్ వరకూ ఉన్నప్పటికీ టీఆర్ఎస్ ప్రభుత్వం 6 నెలలు ముందుగానే ఎన్నికలకు వెళ్లింది. 2018 డిసెంబరులో పార్టీ ఘన విజయం సాధించింది. మెజారిటీ టికెట్లు సిట్టింగ్ ఎమ్మెల్యేలకే ఇచ్చింది. జీహెచ్ఎంసీ పాలక మండలి గడువు ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇక్కడా ముందస్తు ఎన్నికలకు వెళ్లింది. టీఆర్ఎస్ పార్టీ సిట్టింగ్ కార్పొరేట్లకే ఎక్కువ టికెట్లు కేటాయించింది. రిజర్వేషన్లను మార్చకుండా ఉండేందుకు ప్రభుత్వం ఏకంగా మునిసిపల్ చట్టాన్నే సవరించింది. అయినా.. టీఆర్ఎస్ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. ఇక పోతే జిహెచ్ఎంసీ ఎన్నికల ఫలితాలు కీలకాంశాలను వెలుగులోకి తీసుకొచ్చాయి. ఇప్పటికీ సీమాంధ్రకు చెందిన వారిలో అత్యధికులు టిఆర్ఎస్‌తోనే ఉన్నారని స్పష్టమైంది. అయితే ఉత్తరాది నుంచి వలసవచ్చిన, దక్షిణ తెలంగాణకు చెందిన సెటిలర్స్ తీర్పు మాత్రం టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఉంది. సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన వాళ్ళల్లో అత్యధికులు అభివృద్ధికే జై కొడుతూ టీఆర్ఎస్‌కే ఓటు వేసినట్లు ఈ ఫలితాలు రుజువు చేశాయి. 2016లో జరిగిన జీహెచ్ఎంసీ, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో సీమాంధ్ర ఓటర్లు టీఆర్ఎస్‌కే మద్దతు పలికారు. అలాగే ఈ ఎన్నికల్లోనూ ఆ పార్టీకి పట్టం కట్టారు. ఫలితంగానే శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో టీఆర్ఎస్ భారీగా సీట్లు దక్కించుకుంది. ఈ ఏరియాల్లో స్థిరపడిన వారిలో రాయలసీమ, దక్షిణాంధ్రతో పాటు ఉత్తరాంధ్ర ప్రాంతాలకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. వీళ్ళు ఇప్పటికీ తమను అక్కున చేర్చుకున్న టీఆర్ఎస్‌తోనే కలసి నడుస్తున్నారు. ఫలితంగా శేరిలింగంపల్లిలో అత్య ధిక సీట్లు రాగా.. కూకట్‌పల్లిని టీఆర్ఎస్ స్వీప్ చేసింది. ఉత్తర భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడిన వారు మాత్రం బీజేపీకి జై కొట్టారు. ఈ కారణంగానే ఉత్తరాది వారు స్థిరపడిన గోషామహాల్, గన్‌ఫౌండ్రి, బేగంబజార్, జియాగూడ, హిమాయత్ నగర్ తదితర డివిజన్లలో బీజేపీ అత్యధిక సీట్లు కైవసం చేసుకుంది. గతంతో పోలిస్తే ఈసారి టెకీలు అతి తక్కువ సంఖ్యలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు వేసిన వారందరూ అభివృద్ధికి పట్టం కడుతూ అధికార పార్టీకి జై కొట్టారు. ఈ కారణంగానే ఐటీ జోన్‌లో ఉన్న డివిజన్లలో ఒక్క గచ్చిబౌలి మినహాయిస్తే మిగిలిన అన్ని చోట్లా టీఆర్ఎస్ జెండా ఎగిరింది. సర్జికల్ స్ట్రయిక్స్ చేసేంత అవకాశం అధికారం మాత్రం రాకున్నా స్థానాల సంఖ్య ఏకంగా పదిరెట్ల పైన పెరగడమే గాక ఓట్ల శాతం కూడా చాలా ఎక్కువగా వచ్చింది. ఇది నిస్సందేహంగా పాలక టిఆర్ఎస్‌కు ఒక మధ్యంతర హెచ్చరిక వంటిదే. దుబ్బాక ఉప ఎన్నిక ఫలితం కన్నా ఇది పెద్ద దెబ్బగా గుర్తించి పాలనా పరమైన రాజకీయమైన లోపాలు దిద్దుకోకపోతే టిఆర్ఎస్ నష్టపోతుంది. గత పర్యాయం కార్పొరేషన్ ఎన్నికలతో పోలిస్తే ఈ సారి టిఆర్ఎస్ చాలా దెబ్బతిన్నది. కో ఆప్టెడ్ సభ్యులును కలుపుకున్నా మేయర్ పీఠం పొంద లేనంత తక్కువకు పడిపోయింది. ఈ రెండు పార్టీలతో పోలిస్తే మజ్లిస్ తన బలాన్ని దాదాపు నిబెట్టుకోగలిగింది. బిజెపి ప్రచారం చేసినట్టు మజ్లిస్ మేయర్ రాకపోయినా వచ్చినా నగరపాలనలో బలమైన పట్టు కొనసాగిస్తుంది. టిఆర్ఎస్ మజ్లిస్ మధ్య గతంలో వున్న అవగాహన మేయర్ డిప్యూటీ మేయర్ స్టాండిరగ్ కమిటీ వంటి వాటిలో కొనసాగుతుందా లేక ఇతరేతర ఉపాయాలు వ్యూహాలు అమలు చేస్తారా అన్నది ముందు ముందు తేలాలి. రెండు మాసాల వ్యవది వుందని మంత్రి కెటిఆర్ చేసిన వ్యాఖ్యలు టిఆర్ఎస్ లో సాగుతున్న అంతర్గత మధనాన్ని చెబుతుంది. మజ్లిస్ నామకార్థంగా పోటీ పెట్టి టిఆర్ఎస్‌కు మెజార్టీ వచ్చేలా చేయడం, డిప్యూటీ మేయర్ తీసుకోవడం,పదవీ కాలం పంచుకోవడం వంటి ఆప్షన్స్ వుంటాయి. అయితే పరోక్ష అవగాహనకే పాలక పక్షం మొగ్గుచూపొచ్చు. ఈ కాలంలో మరిన్నికో ఆప్షన్స్, లేదా పార్టీ మార్పులు జరిపిస్తారని కొందరంటున్నా ఈ ఫలితం తర్వాత వెంటనే అలాటి రాజకీయ దుస్సాహసాలు చేయకపోవచ్చు.


# బిజెపికి వరంగా కాంగ్రెస్ వైఫల్యాలు

### మరింత మంది చేరికలకు రంగం సిద్ధం

హైదరాబాద్,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా కాంగ్రెస్ వైఫల్యాలను బిజెపి బాగా ఉపయోగించు కుంటోంది. ఆ పార్టీ కుటుంబ పాలనను బాగా ప్రొజెక్ట్ చేస్తూ వచ్చిన బిజెపి మంచి ఫలితాలను రాబడుతోంది. గతంలో నెహ్రూ,ఇందిర కటుంబాలను ఆదరించిన ప్రజలు కాలక్రమంలో వారసత్వ రాజకీయాలను దూరం పెడుతున్నారు. ఈ పరిణామం అన్ని పార్టీలకు కనువిప్పు కావాలి. యూపి, కాశ్మీర్, బీహార్, తెలంగాణ తదితర ప్రాంతాల్లో బిజెపి బలంగా మారడానికి వారసత్వ రాజకీయాలే కారణంగా చూడాలి. తాజా పరిణామాలల్లో బిజెపి ఎదగడానికి కూడా వారసత్వ రాజకీయాలనే ప్రస్తావించాలి.

బిజెపి బలం ఇంతగా పెరగడానికి కారణాలు చూస్తేమొదటి కారణం కాంగ్రెస్ బలహీనపడడం కూడా కారణంగా చెప్పుకోవాలి. అస్సాం, బీహార్, బెంగాల్, ఒరిస్సా, హర్యానా, తమిళనాడు, ఎపి, తెలంగాణ, కర్ణాటక ఇలా చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ బలహీనపడ్డ పరిస్థితి చూస్తున్నాం. సరైన నాయతక్వం లేకపోవడం కూడా కాంగ్రెస్ బలహీనపడేందుకు అవకాశంగా మారింది. టిఆర్ఎస్ కూడా తన ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ గనక బిజెపి పట్ల కొంత మెతక వైఖరితో ఇంతకాలం ఉంటూ వచ్చింది. దానికి తోడ్పాటు కూడా అందించిన రోజులున్నాయి. ఫెడరల్ ఫ్రంట్ అన్నప్పుడు కూడా కెసిఆర్ కాంగ్రెస్, బిజెపి రెంటినీ వ్యతిరేకిస్తానన్నారు. ఇప్పుడు జిహెచ్ఎంసి ఎన్నికల ముంగిట్లోనే బిజెపి విధానాలకు వ్యతిరేకంగా జాతీయ వేదిక అన్నారు గాని అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. దీనికి తోడు పాలనా పరమైన తప్పొప్పులు, హైదరాబాద్‌లో పౌర సమస్యలు, ఇటీవలి వరద పాట్లు వంటివి తోడైనాయి. దుబ్బాకలో కొద్దిపాటి మెజార్టీతో గెలిచిన బిజెపిని హైదరాబాద్‌లో ఏకైక ప్రత్యామ్నాయంగా ఇంకా చెప్పాలంటే కాబోయే విజేతగా ప్రజల్లో బలంగా వెళ్లేలా చేసింది. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎంపి ధర్మపురి అర్వింద్ వంటివారి దూకుడును కూడా ప్రజలు స్వాగతించారు. మజ్లిస్ తమ ప్రధాన ప్రత్యర్థి అని చెప్పినా రాజకీయ వాస్తవాలను బట్టి ఎవరూ తీవ్రంగా విశ్వసించలేదు. కాంగ్రెస్, టిడిపిల అంతర్ధానం కూడా బిజెపికి కలసి వచ్చింది. కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలతో తనను తానే వెన్నుపోటు పొడుచుకుంది. మొన్నటి బీహార్ ఎన్నికల్లో దాని ప్రభావం లేకుండా పోయింది. కాంగ్రెస్ బలహీన పడడం వలన ఏర్పడిన రాజకీయ శూన్యాన్ని కూడా బిజెపి ఉపయోగించుకోగలిగింది. . దక్షిణ భారతంలో బలపడాలన్న బిజెపి ..తమ తాజా వ్యూహాలకు హైదరాబాద్ ఫలితాలను చూపించే ప్రయత్నం పెద్ద ఎత్తునే జరుగుతుంది. ఈ క్రమంలో ఇకముందు కూడా బిజెపి మాత్రం దూకుడు పెంచడమే తగప్పు తగ్గడం వుండదు. ఇకపోతే కాంగ్రెస్ కేవలం రెండుసీట్లు గెలవడం, దుబ్బాకలో డిపాజిట్ కోల్పోవడంతో కాంగ్రెస్ పరిస్థితి మరీ దారుణంగా వుంది గనక పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి రాజీనామా చేయవలసి వచ్చింది. అంతేనా అంటే ఇప్పుడు కాంగ్రెస్ నుంచి అనేకులు బిజెపిలో చేరే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అందులో భాగంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి లాంటి వారు చేరే అవకాశాలు ఉన్నాయి.

# నోములకు ఆస్ట్రేలియా తెలంగాణ వాసుల నివాళి



హైదరాబాద్,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహయ్యకు ఆస్ట్రేలియాలోని తెలంగాణ వాసులు ఘనంగా నివాళులర్పించారు. నాగార్జున సాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య గత మంగళవారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూసిన విషయం తెలిసిందే. టీఆర్ఎస్ ఆస్ట్రేలియా శాఖ అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సిడ్నీ, మెల్‌బోర్న్, కాన్‌బెర్ర, అడిలైడ్, బ్రిస్‌బేన్‌లోని ప్రవాస తెలంగాణ సంఘాలు, వివిధ పార్టీల నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నోముల నర్సింహయ్య ప్రజల కోసమే తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. అణగారిన వర్గాల కోసం పోరాడారని, నాగార్జునసాగర్ ఎన్నికలలో గులాబి జెండా గౌరవాన్ని పెంచారని చెప్పారు. ఎల్లప్పుడూ ప్రజాక్షేమాన్ని అభివృద్ధి కోసం పాటుపడిన అరుదైన నాయకుడని వెల్లడించారు. నోముల మరణం టీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ సమాజానికి ఎంతో నష్టమన్నారు. ఈ కార్యక్రమంలో మంజు, మోనికా, అవంతి, సతీష్, రమేష్, శ్రీధర్, ప్రేమ్, రవి, భార్గవ్, వీరేందర్, సంజయ్, రాజవర్ధన్ రెడ్డి, చందూ, రుద్ర ఇతర ప్రవాస తెలుగు సంఘాలు, పార్టీల సభ్యులు పాల్గొన్నారు.

# మహిళా గౌరవంతోనే సౌభాగ్యం

### రాజకీయాల్లోనూ మహిళలకు సరైన అవకాశాలు కల్పించాలి

### విధానపరమైన నిర్ణయాల్లో వారిని భాగస్వామ్యం చేయాలి

### -ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

చెన్నై,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): అన్నిరంగాల్లో మహిళలకు సరైన అవకాశాలు కల్పించి గౌరవించుకున్నప్పుడే అన్నిచోట్లా సౌభాగ్యం వెల్లివిరుస్తుందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లోనూ మహిళలకు సరైన అవకాశాలు కల్పించి.. విధానపరమైన నిర్ణయాల్లో వారిని భాగస్వామ్యం చేయాల్సిన తక్షణావసరం ఉన్నదని ఆయన పేర్కొన్నారు. మద్రాసు హైకోర్టులో 13 మంది మహిళా న్యాయమూర్తులు ఉండటంపై హర్షం వ్యక్తం చేసిన ఉపరాష్ట్రపతి.. ఇది మరింత పెరుగడం ద్వారా మహిళలు న్యాయవ్యవస్థలోకి వచ్చేందుకు స్ఫూర్తి కలిగించగలమన్నారు. మాజీ ప్రధాని ఐకే గుజ్రాల్ జయంతి సందర్భంగా ఆయన స్మారక పోస్టల్ స్టాంపును చెన్నై రాజభవన్‌లో జరిగిన కార్యక్రమంలో అంతర్జాల వేదిక ద్వారా ఉపరాష్ట్రపతి విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాటాడుతూ.. రాజకీయాలతోపాటు ప్రజాపాలన, కార్పొరేట్ పాలన, పౌర సమాజం సంస్థల్లో భారతదేశంతోపాటు ప్రపంచవ్యాప్తంగా మహిళల పాత్ర గణనీయంగా పెరగడంపై హర్షం వ్యక్తం చేశారు. 17వ లోకసభలో 78 మంది మహిళా ఎంపీలు ఉన్న విషయాన్ని గుర్తుచేస్తూ.. మొత్తం ఎంపీల సంఖ్యలో ఇది 14 శాతం మాత్రమేనన్నారు. స్థానిక సంస్థల్లో మహిళల రిజర్వేషన్లను అమలుచేయడం ద్వారా చాలా మంది అతివలు తమ సత్తాచాటుతున్నారని వారి నాయకత్వ ప్రతిభను చాటుకుంటున్నారని ఆయన తెలిపారు. మాజీ ప్రధాని ఐకే గుజ్రాల్‌కు నివాళులు అర్పించిన ఉపరాష్ట్రపతి.. గుజ్రాల్ మృదు స్వభావి, విద్యావంతుడు, మర్యాదస్తుడైన రాజకీయవేత్త అని ప్రశంసించారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా తన సిద్ధాంతాలను వదలకుండా ముందుకెళ్లిన వ్యక్తి అని కొనియాడారు. 'స్నేహపూర్వకమైన వ్యక్తిత్వం, మర్యాదపూర్వకంగా వ్యవహరించే వారి తత్వంతోపాటు రాజకీయాలకు అతీతంగా అందరితోనూ సత్సంబంధాలు వారిని మరింత ఉన్నతమైన వ్యక్తిగా తీర్చిదిద్దాయి' అని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. రాజకీయాల్లో ఉన్నవారంతా ఇతర పార్టీల వారిని ప్రత్యర్థులుగా భావించాలి తప్ప శత్రువులుగా కాదని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యుడు నరేశ్ గుజ్రాల్, మాజీ ఎంపీ తర్లోచన్ సింగ్, తమిళనాడు సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ బీ సెల్వకుమార్, తమిళనాడు సిటీ రీజియన్ పోస్టు మాస్టర్ జనరల్ సుమతి రవిచంద్రన్‌తోపాటు పలువురు ప్రముఖులు, ఐకే గుజ్రాల్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# అంతర్గత విషయాల్లో జోక్యం వద్దు

### కెనడాకి భారత్ ఘాటు హెచ్చరిక

### కెనడా ప్రధాని వ్యాఖ్యలను తప్పుబట్టిన భారత్

### కెనడా దౌత్యాధికారికి సమన్లు

న్యూఢిల్లీ,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఆందోళన చేస్తోన్న సంగతి తెలిసిందే. రైతుల ఆందోళనపై కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో, పార్లమెంట్ సభ్యులు చేసిన వ్యాఖ్యలను భారత్ తప్పుబట్టింది. భారత అంతర్గత వ్యవహారాల్లో కెనడా తలదూర్చడాన్ని తీవ్రంగా పరిగణించింది. ఇలాంటి చర్యలు ఇకపై కొనసాగితే ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై తీవ్ర ప్రభావం ఉంటుందని హెచ్చరించింది. ఈ మేరకు భారత విదేశీ వ్యవహారాల శాఖ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రకటనలో కెనడా హైకమిషనర్‌కు ఆ దేశ మంత్రులు, ఎంపీలు చేసిన వ్యాఖ్యల తీవ్రతను తెలియజేసింది. కెనడాలోని భారత కమిషన్, కౌన్సిలేట్ల ముందు ఉగ్రవాద కార్యాకలాపాల సమావేశాలను ప్రోత్సహించటం శాంతి, భద్రతలకు ముప్పువుతుందని తెలిపింది. కాగా, గత సోమవారం గురునానక్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో కెనడా ప్రధాని ట్రూడో ఢిల్లీలో జరుగుతున్న రైతుల ఆందోళనపై మాట్లాడుతూ.. ''శాంతియుతంగా నిరసనలు చేపట్టే హక్కులకు కెనడా ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తుంది" అని అన్నారు.

## జమియతుల్ హుఫ్ఫాజ్ ఆధ్వర్యంలో యువ ఇస్లామిక్ పండితులకు సన్మానం



కరీంనగర్. డిసెంబర్ 5 (నేటినిజం ప్రతినిధి):కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో మస్జిదుల్లో మౌళిక సదుపాయాలు.. అందులో పనిచేస్తున్న ఇమామ్ లకు నెలవారీ జీతాలు ఇస్తూ తోడ్పాటునందిస్తున్న జమియతుల్ హుఫ్ఫాజ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్ నగరానికి, ఉమ్మడి జిల్లాకు చెందిన యువకులు ప్రపంచ అత్యున్నత ఇస్లామిక్ యూనివర్సిటీల్లో మౌలాన (ఆలీమ్) చదువును ముగించుకొని వచ్చిన యువ ఇస్లామిక్ పండితులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం..నెలవారీ ప్రత్యేక సమావేశం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జమియతుల్ ఉలేమా జిల్లా అధ్యక్షుడు ముఫ్తి ఏతేమాధుల్ హాఖ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మస్జిదుల్లో అంకితభావంతో సేవ చేస్తున్న ఇమామ్ ల సేవలు మరువలేనివని అన్నారు. జమియతుల్ హుఫ్ఫాజ్ స్వచ్ఛంద సేవా సంస్థ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో అనేక రకాలుగా గ్రామీణ పేద ముస్లింలకు అండగా నిలుస్తోందన్నారు. జమియతుల్ హుఫ్ఫాజ్ సంస్థకు విరివిగా విరాళాలు అందించి తోడ్పాటు అందించాలని ముస్లిం సమాజానికి పిలుపునిచ్చారు. కరీంనగర్ దారు ల్ ఖైర్ సొసైటీ తరపున జమియతుల్ హుఫ్ఫాజ్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో మస్జిదుల్లో పనిచేస్తున్న ఇమామ్ లకు చలికాలం దృష్ట్యా బ్లాంకెట్లు దుప్పట్లు పంపిణీ చేశారు.

ఈకార్యక్రమంలో జమియతుల్ హుఫ్ఫాజ్ జిల్లా అధ్యక్షుడు హాఫిజ్ మంఖబాత్ శాఖాన్, ఉపాధ్యక్షుడు హాఫిజ్ జియాఉల్లాహ్ ఖాన్, కార్యదర్శి హాఫిజ్ వసిముద్దీన్, మజ్లిస్ ఉలేమా అధ్యక్షుడు ముఫ్తి ఘియాస్, హాఫిజ్ మౌజ్జమ్ హుస్సేన్ ఫైజీ, హాఫిజ్ సాధఖ్ అలీ, హాఫిజ్ ఫరీదుద్దీన్ అంజత్, హాఫిజ్ రిజ్వాన్, దారుల్ ఖైర్ సొసైటీ బాధ్యులు పాల్గొన్నారు.

## సిద్ధిపేటలో ఘోర రోడ్డు ప్రమాదం

### -ఐదుగురు అక్కడిక్కడే మృతి

సిద్ధిపేట,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): సిద్ధిపేట జిల్లా రాజీవ్ రహదారిపై సిద్ధిపేట శివారులో ఘోర ప్రమాదం జరిగింది. పెద్దపల్లి నుండి హైదరాబాద్ కు వెళ్తున్న రాజిరెడ్డి అనే వ్యక్తి నడుపుతున్న కారు సిద్ధిపేట రాజీవ్ రహదారి పై డివైడర్ కు ఢీ కొట్టికొట్టడంతో కార్ లో ప్రయాణిస్తున్న ముగ్గురు మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సిద్ధిపేట టూ టౌన్ సీఐ పరశురాం , ఎస్ఐ కనకయ్య మరియు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని శవాలను మార్చురీ కి తరలించడానికి ప్రయత్నిస్తుండగా,అదే సమయంలో కరీంనగర్ నుండి వస్తున్న డీసీఎం ఘటనాస్థలిలో గుమిగూడిన జనంపైకి దూసుకొచ్చిన డీ కొట్టగా సిద్ధిపేట సీఐ పరశురాం గౌడ్ తో పాటు కానిస్టేబుల్స్, మరియు 10 మంది స్థానికులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంలో సిద్ధిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం రామునిపట్ల గ్రామానికి మల్లేశం, మందపల్లి కి చెందిన రాజిరెడ్డి మృతి చెందారు.

## మోదీది కపట ప్రేమ

### చర్చల పేరుతో కాలయాపన

### అదానీ, అంబానీలకు కట్టబెట్టే ప్రయత్నం

### వ్యవసాయ చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోవాలి

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి

సిద్ధిపేట,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): కేంద్రం తెచ్చిన నూతన వ్యవసాయ చట్టానికి వ్యతిరేకంగా ఢిల్లీలో ఎముకలు కొరికే చలిలో కూడా రైతులు పోరాటం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి తెలిపారు. కానీ కేంద్రం చర్చల పేరుతో కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. నూతన వ్యవసాయ చట్టం వల్ల మద్దతు ధర లేక మార్కెట్లు రద్దు అవుతున్నాయని చెప్పారు. కేంద్రం వ్యవసాయాన్ని అదానీ, అంబానీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. రైతులపై మోదీది కపట ప్రేమ అని మండిపడ్డారు. కేంద్రం తక్షణమే మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరణ చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5 న జరిగే దేశ వ్యాప్త నిరసనకు, 8 న జరిగే దిగ్బంధం కార్యక్రమాలకు సీపీఐ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. అడ్డదారులు తొక్కి అధికారం చేపట్టాలనే వారిని సీపీఐ ఖండిస్తుందన్నారు. ఓటింగ్‌పై ఎన్నికల కమిషన్ ఇచ్చిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు.

## 9న నగరానికి విదేశీ రాయబారులు

### భారత్ బయోటెక్ ను సందర్శించే అవకాశం

హైదరాబాద్,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): దాదాపు 80 దేశాలకు చెందిన రాయబారులు, హై కమిషనర్లు ఈనెల 9వ తేదీన హైదరాబాద్ నగరాన్ని సందర్శించనున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా అవసరమైన ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయా శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం తరపున వారికి ఆతిధ్యం ఇవ్వనున్నట్టు ఈసందర్భంగా తెలిపారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఈ పర్యటనను ఏర్పాటుచేసింది. సీఎస్ నిర్వహించిన సమావేశంలో చీఫ్ ప్రోటోకాల్ నగేశ్‌సింగ్,తో పాటు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విదేశీరాయబారులు, హైకమిషనర్లు వచ్చిన సందర్భంగా అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. ఈసందర్భంగా వారు కోవిడ్-19 వ్యాక్సిన్ తయారు చేస్తున్న భారత్ బయోటెక్‌లిమిటె డ్, బయోలాజికల్ ఈ లిమిటెడ్ తదితర సంస్థలను వారు పరిశీలిస్తారు. నగరంలో వారు ప్రయాణించడానికి 5 లగ్జరీ బస్సులను, స్పెషల్ మెడికల్ టీమ్స్ ఏర్పాటు చేయాలని సీఎస్ సోమేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నగరంలో వ్యాక్సిన్‌తయారీ సంస్థల తయారీ సామర్థ్యం, వాటి పనితీరుపై ప్రత్యేక ప్రజెంటేషన్ కూడా ఇవ్వనున్నారు. అలాగే ఫార్మాసిటీ, జీనోమ్ వ్యాలీని కూడా వారు సందర్శిస్తారని సీఎస్ తెలిపారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ (పొలిటికల్) వికాస్‌రాజ్, రవాణశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్, సైబరాబాద్ సీపీ సజ్జనార్, హైదరాబాద్ కలెక్టర్ శ్వేతా మహంతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

### ఎన్నికల కమిషన్ స్వతంత్ర వ్యవస్థ

## హైకోర్టుకు హక్కు లేదు

### కోర్టుల జోక్యం తగదు

### ఎస్ఈసీ రివ్యూ పిటిషన్

హైదరాబాద్,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): నిన్న రాత్రి ఎస్ఈసీ ఉత్తర్వులు ఇవ్వడం.. తెల్లవారి దాన్ని హైకోర్టు కొట్టివేయడం.. అప్పటికే పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ పూర్తి కావడంతో జీహెచ్ఎంసీ ఎన్నికల ఫలితాలు కౌంటింగ్ గందరగోళంలో పడిపోయాయి.నిన్న రాత్రి తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్వస్తిక్ గుర్తు ఓట్లపై లేకున్నా.. పెన్నుతో టిక్ చేసినా కూడా ఓటుగానే పరిగణించాలని ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై బీజేపీ హైకోర్టుకు ఎక్కగా.. తాజాగా స్వస్తిక్ గుర్తు ఉంటే ఓటు అని తీర్పునిచ్చింది. ఇప్పటికే ఎస్ఈసీ ఆదేశాల మేరకు కౌంటింగ్ పూర్తయ్యింది. బీజేపీకే పోస్టల్ బ్యాలెట్ లో మెజార్టీ వచ్చింది. స్వస్తిక్ గుర్తు లేని వాటిని కూడా లెక్కించారు. ఇప్పుడు హైకోర్టు ఆదేశాలతో మళ్లీ లెక్కిస్తారా? అదే కొనసాగిస్తారా అన్నది గందరగోళంగా మారింది. దీనిపై తాజాగా ఎస్ఈసీ హైకోర్టుకు ఎక్కారు. లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు.. రాష్ట్ర ఎన్నికల సంఘం స్వతంత్ర హోదాలో పని చేస్తుందని.. దీని అధికారాల విషయంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడం సరికాదనే విషయాన్ని గుర్తు చేస్తోంది. ఈ విషయాన్నే కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శుక్రవారం ఉదయం ఇచ్చిన తీర్పును హైకోర్టు పునః పరిశీలించాలని ఎస్ఈసీ కోరింది. దీనిపై హైకోర్టు ఎలా స్పందిస్తుందనేది ఆసక్తిగా మారింది.

# మలేరియా రహిత భారతం సాధ్యమా...?

## (ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన ప్రపంచ మలేరియా నివేదిక-2020 ఆధారంగా)

మలేరియా వ్యాధికి ముక్కుతాడు వేయడంతో భారత్ సఫలీకృతం అయ్యిందని 'ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ)' తాజాగా విడుదల చేసిన 'ప్రపంచ మలేరియా నివేదిక-2020' తెలియజేసింది. ప్రపంచవ్యాప్తంగా గత రెండు దశాబ్దాలలో 1.5 బియన్ మలేరియా కేసులు చికిత్సతో నయం కాగా, 7.6 మిలియన్ల ప్రజలను ప్రాణాపాయం నుంచి తప్పించడం జరిగిందని నివేదిక తెలిపింది. 2019లో 229 మిలియన్ల మలేరియా కేసులు మరియు 4.09 లక్షల మరణాలు జరిగాయని నివేదిక వెల్లడించింది. నివారించదగిన మరియు నయం చేయగల మలేరియా వ్యాధితో సాలీన 4 లక్షల మరణాలు, అందులో 67 శాతం (2,74,000) ఐదేళ్ళ లోపు పిల్లలు ఉండడం విచారకరం. మలేరియా వ్యాధి నివారణ, చికిత్స, నిర్ధారణ మరియు పర్యవేక్షణ రంగాల్లో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టడంతో మంచి ఫలితాలు కనిపిస్తున్నాయని వివరించింది. ప్రపంచంలోని 87 మలేరియా ప్రాబల్యం అధికంగా ఉన్న దేశాల్లో పలు అవసర చర్యలు తీసుకోవడం జరిగింది. ప్రాణాపాయాన్ని కలిగించే మలేరియా వ్యాధి ఆడ అనాఫిలిస్ దోమ తొలి మలి సంధ్య వేళల్లో కాటు వేయడం వల్ల సోకుతుంది. నిలువ నీటిలో గుడ్లు పెట్టడం, సంతానోత్పత్తి చేయడంతో దోమల సంఖ్య పెరిగి, మలేరియా వ్యాప్తికి కారణం అవుతాయి. మలేరియాకు ఖచ్చితమైన చికిత్సలు మరియు నివారణ మార్గాలు ఉన్నాయి. మలేరియా నిర్మూలన మరియు చికిత్స కోసం 2019లో 3 బిలియన్ డాలర్లు (ప్రాబల్య దేశాల ప్రభుత్వాలు 31 శాతం) ఖర్చు చేయడం జరిగింది. ప్లాస్మోడియం పరాన్నజీవి కారణంగా మలేరియా వ్యాధి సోకుతుంది. మలేరియా వ్యాధి లక్షణాల్లో చలి జ్వరం, తలనొప్పి, రక్తహీనత, శ్వాస ఇబ్బందులు, రోగనిరోధకశక్తి లోపించడం లాంటివి కనిపిస్తాయి. సకాలంలో వైదియ సహాయం అందని యెడల ప్రాణాలు కూడా పోవచ్చు. మలేరియా ప్రాబల్యం అధికంగా ఉన్న ప్రాంతాలుగా సబ్-సహారా, ఆసియా, తూర్పు మెడిటెర్నియన్, పసిఫిక్ మరియు అమెరికాలు గుర్తించబడినవి. శిశువులు, ఐదేళ్ళ లోపు పిల్లలు, గర్భిణులు, హెచ్ఐవి/ఏయిడ్స్ రోగులు, వలసదారులు మరియు యాత్రలు చేసే వారికి మలేరియా సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తేలింది. 2019లో నమోదైన మొ?త్తం మలేరియా కేసుల్లో ఆఫ్రికా ప్రాంత దేశాల్లో మాత్రమే 94 శాతం కేసులు మరియు మరణాలు జరుగుతున్నాయి. ప్రపంచ మలేరియా మరణాల్లో 50 శాతం నైజీరియా (27 శాతం), కాంగో (12 శాతం), టాంజానియ (5 శాతం), బుర్కినా ఫాసో (4 శాతం), మొజాంబిక్ (4 శాతం) మరియు నైగర్ (3 శాతం) దేశాల్లోనే జరుగుతున్నాయి.

ఇండియాలో 2018 మలేరియా గణాంకాలతో పోల్చితే 2019లో వ్యాధి 17.6 శాతం తగ్గిందనే వాస్తవాన్ని అధికారికంగా వివరించింది. 2018లో 'వార్షిక పరాన్నజీవి ప్రాబల్యం (అన్యువల్ పారాసైటిక్ ప్రివలెన్స్, ఏపిఐ)' 27.6 శాతం తగ్గడంతో పాటు 2019లో 18.4 శాతం నమోదు కావడం జరిగింది. భారత్‌లో మలేరియా కేసుల సంఖ్య 2000 నుండి 2019 మధ్య 20 మిలియన్ల నుంచి 6 మిలియన్లకు పడిపోవడం సంతోషదాయకం. మన దేశంలో మలేరియా అనారోగ్యాలు 83.34 శాతం మరియు మలేరియా మరణాల రేటు 92 శాతం తగ్గడం గమనించబడింది. మలేరియా గణాంకాల ప్రకారం ఇండియాలో 2000 సంవత్సరంలో 20,31,790 మలేరియా కేసులు మరియు 932 మరణాలు నమోదైనవి. 2019లో మాత్రం 3,38,494 మలేరియా కేసులు మరియు 77 మలేరియా కారణ మరణాలు జరిగాయి. భారత్‌లో అక్టోబరు 2020 వరకు 1,57,284 మలేరియా కేసులు మాత్రమే గుర్తించబడడం విశేషం. భారత ఆరోగ్య మంత్రిత్వశాఖ 2015 - 2016 నుంచి చేపట్టిన మలేరియా నిర్మూలన చర్యలు సత్ఫలితాలను ఇవ్వడంతో వ్యాధి అదుపు చేయబడుతోంది. దేశవ్యాప్తంగా మలేరియా నిర్మూలనకు చేపట్టిన చర్యల్లో మైక్రోస్కోపుల అందుబాటు, సత్వర రోగనిర్ధారణ పరీక్షలు మరియు 7.25 కోట్ల దోమ తెరలను మలేరియా ప్రాబల్యం అధికంగా ఉన్న ఈశాన్య రాష్ట్రాలు/ఛత్తీస్‌ఘడ్/ఝూర్ఖండ్/యంపి/ఒడిసాల్లో పంపిణి చేయడంతో వ్యాధి అదుపు చేయబడిందని నివేదిక తెలిపింది.

మలేరియాను నివారించడానికి దోమ కాటుకు దూరంగా ఉండడం, దోమ తెరలను విధిగా వాడడం, గృహ పరిసరాల్లో నిలువ నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం, దోమలను వికర్షించే కాయిల్స్, ద్రవాలు లేదా స్ప్రేలు వాడడం, నిలువ నీటిలో జంపూచియా చేపలు లేదా నూనెలు వేయడం, నివాస ప్రాంతాల్లో క్రిమిసంహారిణులను ఉపయోగించడం లాంటి పలు చర్యలు చేపట్టాలి. మలేరియా సోకిన వ్యక్తులు వెంటనే సరైన వైద్య చికిత్సలు తీసుకోవడం తప్పనిసరి, లేని యెడల ప్రాణాపాయం కూడా కలుగవచ్చు. యాత్రలు, ప్రయాణాలు చేసే వారు డాక్టర్లు సూచించినట్లు ముందస్తుగా ఆంటీ-మలేరియా మందులను వాడడం మంచిది. మలేరియా నివారణకు 'ఆర్‌టియస్, యస్' అనబడే వ్యాక్సీన్ అందుబాటులో ఉంది. ఈ టీకా వల్ల పిల్లల్లో మలేరియా తీవ్రత తగ్గడం మరియు ప్రాణాపాయం తప్పడం జరుగుతుంది. పటిష్ట మలేరియా నివారణ చర్యలు తీసుకున్న దేశాలు 'మలేరియా రహిత దేశాలు'గా ప్రకటించే స్థాయికి చేరడం సంతోషదాయకం. యుఏఈ, మొరాకో, తుర్కమెనిస్థాన్, అర్మేనియ, శ్రీలంక, కిర్గిస్థాన్, పెరగ్వే, ఉజ్జెకిస్థాన్, అల్జీరియ మరియు అర్జంటీనలు 'మలేరియా రహిత దేశాలు'గా డబ్ల్యూహెచ్ఓ సగర్వంగా ప్రకటించింది. 2015లో డబ్ల్యూహెచ్ఓ తీసుకున్న 'ప్రపంచ మలేరియా సాంకేతిక వ్యూహం 2016 - 2030' కార్యక్రమం ద్వారా మలేరియా అధికంగా ఉన్న దేశాల్లో పలు పటిష్ట నివారణ చర్యలు తీసుకుంటున్నారు. 2030 నాటికి మలేరియా కేసులను 90 శాతం తగ్గించడం, కనీసం 35 దేశాలను మలేరియా రహిత దేశాలుగ ప్రకటించడం, మలేరియా వ్యాప్తి పెరగకుండా చూడడం అనే ఉన్నత లక్ష్యాలతో డబ్ల్యూహెచ్ఓ ముందుకు సాగుతోంది. 2018లో తీసుకున్న నిర్ణయం ప్రకారం 'హై బర్డెన్ టు హై ఇంపాక్ట్' నినాదంతో మలేరియా లేని ప్రపంచాన్ని నిర్మించాలని ఐరాస కృషి చేస్తున్నది. ఇండియాతో పాటు ప్రపంచ దేశాలన్ని మలేరియా రహిత దేశాలుగా నిలవాలని అందరం కోరుకుందాం, తగు జాగిరత్తలతో జీవిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# పిసిసి పీఠంపై నేతల కన్ను

## పోటీ పడుతున్న కోమటిరెడ్డి, రేవంత్ వర్గాలు
## ఎవరికిచ్చినా మరొకరు పార్టీ వీడే ఛాన్స్?

హైదరాబాద్,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): పిసిసి చీఫ్‌గా ఉత్తమ్ కుమార్ రెడ్డి రాజీనామా ప్రకటనతో ఇప్పుడు అందరి దృష్టి తదుపరి పిసిసి చీఫ్ ఎవరన్నదానిపై పడింది. కాంగ్రెస్‌లో ఓటమి విశ్లేషణలకన్నా పదవులపైనే ప్రధాన దృష్టి పెట్టారు. ఉత్తమ్ రాజీనామాతో ఇప్పుడు పిసిసి పీఠం కోసం నేతల్లో పోటీ నెలకొంది. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,రేవంత్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ,శ్రీధర్ బాబు తదితరులు రేసులో ఉన్నారు. అయితే రేవంత్‌కు పదవిపై ఇప్పటికే పార్టీలో ఓ వర్గం వ్యతిరేకిస్తోంది. ఉత్తమ్ కుమార్ రాజీనామాతో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎంపీ రేవంత్ రెడ్డి వర్గంలో ఆశలు చిగురిస్తున్నాయి. పీసీసీ పదవీ బాధ్యతలు రేవంత్‌ను అప్పగిస్తారని ఆయన వర్గం నేతలు, అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో నానాటికీ దిగజారిపోతున్న కాంగ్రెస్ పార్టీని ఆయన మాత్రమే గాడిలోపెట్టగలరని, కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకురాగలరని బలంగా నమ్ముతున్నారు. అయితే ఇప్పటికే రేవంత్‌కు కాంగ్రెస్ అధిష్టానం నుంచి పిలుపు వచ్చిందని డిసెంబర్ 9న దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని తెలంగాణ రాజకీయాల్లో జోరుగా చర్చసాగుతోంది. ఈ క్రమంలోనే మరో అనమ్మతి వర్గం నిరసన స్వరాన్ని వినిపిస్తోంది. పార్టీలో ఎప్పటినుంచో ఉంటున్న సీనియర్లను కాదని టీడీపీ నుంచి వచ్చిన రేవంత్‌కు పీసీసీ బాధ్యతలు ఎలా ఇస్తారని ఎంపీ కోమటిరెడ్డి వెంకట రెడ్డి వర్గం బహిరంగంగానే నిలదీస్తోంది. ఈ మేరకు అధిష్టానానికి సైతం ఫిర్యాదు చేసినట్లు సమాచారం అందుతోంది. పీసీసీ పదవి తమకే ఇవ్వాలని కోమటిరెడ్డి సోదరులు మీడియా ముఖంగా పలుమార్లు డిమాండ్ చేశారు. పదవి తమకు దక్కనిపక్షంలో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరతామని రాజ్‌గోపాల్ చేసిన వ్యాఖ్యలు ఆ మధ్య పెను దుమారాన్నే లేపాయి. ఈ నేపథ్యంలోనే గ్రేటర్ ఓటమి, ఉత్తమ్ రాజీనామా తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సంక్షోభానికి దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామాలను ఆ పార్టీ నేతలు ఏ విధంగా ఎదుర్కొంటారనేది చూడాల్సిఉంది. ఇదిలా వుంటే గ్రేటర్ ఫలితాలపై ఎన్నో ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ.. ఫలితాలు చూసి బొక్కబోర్లాపడింది. గతంలో చక్రంతిప్పిన గడ్డపైనే చతికలపడింది. ఓటమితో పోటీ పడుతున్నట్లు నానాటికీ ప్రజాదరణ కోల్పోతుంది. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కేవలం రెండు స్థానాలకే పరిమితమైన హస్తం పార్టీ.. ఈసారి కూడా అవే ఫలితాలను పునరావృత్తం చేసింది. కేవలం 2,24,528 ఓట్లతో 5శాతం వాటాను దక్కించుకుని దారుణ పరాజయాన్ని మూటగట్టుకుంది. ఇతర పార్టీలను ఏమాత్రం ఎదుర్కోలేక ఓటమి ముందు తలవంచింది. ఇప్పటికే వరుస ఓటములతో పీకల్లోతు కష్టాల్లో ఉన్న పార్టీకి గ్రేటర్ ఎన్నికల పరాజయం ఆ పార్టీ భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఓవైపు సీనియర్ నేతలు ఒక్కకరూ పార్టీని వీడి కాషాయతీర్థం పుచ్చుకుంటుండగా.. కార్యకర్తలు సైతం తమదారి తాము చూసుకుంటున్నారు. ఈ తరుణంలో టీపీసీసీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు, ఆ పార్టీ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ పీసీసీ పదవి నుంచి వైదులుగుతున్నట్లు ఓ లేఖను విడుదల చేశారు. కొత్త అధ్యక్షుడి ఎన్నిక పక్రియను సైతం ప్రారంభించాలని ఏఐసీసీని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరపరాజయం నాటి నుంచి ఉత్తమ్ రాజీనామా కోసం పార్టీలోని ఓ వర్గం బలంగా డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ తరుణంలో పార్లమెంట్, దుబ్బాక ఉప ఎన్నిక, బల్దియా పోరులో ఓటములతో ఆ ఒత్తిడి మరింత పెరిగింది. దీంతో పదవికి రాజీనామా చెయకతప్పలేదు.

# వర్గీకరణ కోసం మాదిగలు ఉద్యమించాలి



రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 5 (నేటినిజం ప్రతినిధి): ఎబిసిడి వర్గీకరణ కోసం మాదిగలు, మాదిగల ఉపకులాలు ఉద్యమించాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జి తాండ్రల తిరుపతి అన్నారు, చందుర్తి మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది, ఈసమావేశానికి వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి తాండ్రల తిరుపతి హాజరై మాట్లాడుతూ మాదిగ ఉపకులాలలో జనాభా దామాషా ప్రకారం అందరికీ సమానమైన వాటా దక్కడం కొరకు వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఏ బి సి డి ల వర్గీకరణ కోసం ఉద్యమం చేస్తే తప్ప వర్గీకరణ సాధ్యమయ్యే అవకాశం లేదని రాజ్యాంగంలో కల్పించిన హక్కులను కాలరాస్తూ అనగారిన వర్గాల జీవితాలతో ఆటలాడుకుంటున్న ప్రభుత్వాలను గద్దె దించకపోతే మన బతుకులు మారవు అని , సామాజిక న్యాయం, ఆర్థిక న్యాయం, రాజకీయ న్యాయం, అనే మూడు నిన్న నినాదాలతో తో మహాజన సోషలిస్టు పార్టీని ప్రారంభించిన గౌరవ శ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పార్టీని బలోపేతం చేయడంతోపాటు వర్గీకరణ దిశగా అడుగులు వేయాలని దానికి మాదిగ మాదిగ ఉపకులాల ఉద్యమించాలని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నర్సింగాపూర్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి గ్రామ కమిటీ అధ్యక్షులు నేధురి రవి , ఉపాధ్యక్షులు దొబ్బల శంకర్ , ప్రధాన కార్యదర్శి మల్యాల మహేష్,, శంకర్, స్వామి, ఆ రెల్లి విజయ్, మహేష్, సతీష్, నేదునూరి లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు

# 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ శ్రీ కృష్ణ భాస్కర్

-చందుర్తి, రుద్రంగి మండలాల లోని పలు గ్రామాలలో పర్యటించిన కలెక్టర్
-ఓటరు నమోదు ప్రక్రియ పరిశీలన
-రేపటితో ముగియనున్న గడువు
-ఓటరు కార్డులో సవరణలకు ఇదే మంచి అవకాశం



రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 5 (నేటినిజం ప్రతినిధి):జిల్లాలోని 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఓటరు కార్డులో చిరునామా, తదితర మార్పులకు ఇదే మంచి అవకాశమని జిల్లా కలెక్టర్ శ్రీ కృష్ణ భాస్కర్ తెలిపారు.

శనివారం చందుర్తి మండల కేంద్రం, మూడపెల్లి, మర్రిగడ్డ, రుద్రంగి మండల కేంద్రం లోని పోలింగ్ బూత్ లను సందర్శించి ఓటరు నమోదు ప్రక్రియ ఏ విధంగా జరుగుతుంది, ప్రజల నుండి ఎలాంటి స్పందన వస్తుంది అని బీఎల్ఓ లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

జిల్లాలోని అన్ని గ్రామాలలోని 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు ఆవశ్యకతపై అన్ని గ్రామాలలో దండోరా వేయించాలని, విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటరు నమోదు, ఓటరు కార్డులో సవరణలకు ఈరోజు, రేపు (5,6 తేదీలలో) మాత్రమే అవకాశం ఉంది తెలిపారు.

ఓటరు నమోదుకు, ఇతర మార్పు, చేర్పులు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, తదితర సవరణల కోసం బీఎల్ఓ ల దగ్గరికి వచ్చే ప్రజలు అవసరమైన అన్ని వివరాలు సక్రమంగా సిబ్బందికి తెలుపాలని కోరారు. ఈ ఓటరు నమోదు ప్రక్రియపై అందరికీ అవగాహన కల్పించి ఓటు హక్కు ఆవశ్యకతను తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి ఎలక్ట్రోరోల్ ను అప్‌డేట్ చేయడానికి సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భనలో సంబంధిత మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అనంత టిడిపిలో వర్గపోరు

## జెసి పవన్, ప్రభాకర్ చౌదరిల మధ్య ముదరిన వివాదం

అనంతపురం,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): అనంతపురం తెలుగుదేశం పార్టీలో వర్గపోరు తీవ్రమైంది. జేసీ దివాకర్‌రెడ్డి కుమారుడు పవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిల మధ్య వివాదం ముదురుతోంది. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో జేసీ పవన్‌రెడ్డి కార్యక్రమాలు చేపట్టడంతో.. తన అనుమతి లేకుండా ఎందుకు పర్యటిస్తున్నారంటూ ప్రభాకర్ చౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. జేసీ పవన్‌రెడ్డిని ఆయన ఓ శకునిగా అభివర్ణించారు. తాడిపత్రిలో టీడీపీని నాశనం చేశారని.. ఇప్పుడు అనంతపురం నియోజకవర్గంలో టీడీపీని డ్యామేజ్ చేసేందుకు తిరుగుతున్నారని జేసీ పవన్‌పై ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. జేసీ పవన్ నియంతలా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. జేసీ దివాకర్‌రెడ్డి వర్గంతో ప్రత్యక్షపోరుకు సిద్ధమంటూ ప్రభాకర్ చౌదరి సవాల్ విసిరారు

# మరింత స్వచ్ఛంగా వరంగల్ నగరం

## -స్వీపింగ్ మిషన్లను ప్రారంభించిన ఎర్రబెల్లి




వరంగల్,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): మరింత పరిశుభ్రంగా, సర్వాంగ సుందరంగా వరంగల్ మహా నగరాన్ని తీర్చిదిద్దేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. వరంగల్ నగర పారిశుద్ధ్యంలో భాగంగా రోడ్లను శుభ్రం చేయడానికి వీలుగా కొనుగోలు చేసిన రెండు స్వీపింగ్ మిషన్లను, కంప ట్రాక్టర్లు, షీ మొబైల్ టాయిలెట్స్ బస్సులను వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో మంత్రి ఎర్రబెల్లి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రూ. 38 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో 193 పారిశుద్ధ్య వాహనాలు కొనుగోలు చేయడానికి నిర్ణయించగా, అందులోని 75 వాహనాలు ఇప్పటికే వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతానికి స్మార్ట్ సిటీ నిధుల నుండి ఒక్కో మిషన్ కి రూ.2 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన రెండు యంత్రాలను ప్రారంభించినట్లు చెప్పారు. ఒక యంత్రం ఒక రోజుకి 40 కి.మీ. మేర, మూడు మీటర్ల వెడల్పుతో, 3 మీటర్ల ఎత్తుతో రోడ్లను పరిశుభ్రం చేస్తుందన్నారు. ప్రధాన రహదారులు, వాణిజ్య సముదాయాల పరిశుభ్రతకు ఈ వాహనాలు ఎంతో ఉపయోపగడతాయన్నారు. త్వరలోనే మరో పది యంత్రాలను రూ.7 కోట్ల 35 లక్షల వ్యయంతో కొనుగోలు చేసేందుకు ప్రతిపాదించడమైనందన్నారు. అదేవిధంగా పట్టణ ప్రగతి నిధులు రూ.26 కోట్ల 53 లక్షలతో 11 తడి, పొడి చెత్త వేరు చేసే యంత్రాలను కొనుగోలు చేయడానికి ప్రతిపాదించినట్లు మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండా ప్రకాశ్ రావు, రాజ్యసభ సభ్యులు బండ ప్రకాశ్, ఎమ్మెల్యే అరూరి రమేశ్, అర్బన్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, కమిషనర్ పమేలా తస్పతి, పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రేమపేరుతో యువతులకు వల

## డబ్బుల కోసం పెళ్లిళ్ల పేరుతో డబ్బులు కాజేసే దందా
## భార్య ఫిర్యాదుతో బట్టబయలైన యువకుడి బాగోతం

హైదరాబాద్,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): ప్రేమ పేరుతో యువతులను మోసం చేస్తున్న ఓ వివాహితుడి లీలలు బయటపడ్డాయి. చందానగర్ ఆర్టీసీ కాలనీకి చెందిన కుర్ర విజయ్ భాస్కర్‌పై కట్టుకున్న భార్య సౌజన్య ఫిర్యాదుతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

బందువుల సంబంధం కావడంతో ఉద్యోగం లేకపోయినా విజయ్ భాస్కర్‌కు భారీగా కట్నకానుకలు సమర్పించి ఒంగోలుకు చెందిన సౌజన్య వివాహం చేసుకుంది.

అనంతరం విజయ్ భాస్కర్ కుటుంబ సభ్యులు అంతా కలిసి అదనపు కట్నానికి ఆశపడి అతనికి మరో వివాహం చేసేందుకు పథకం పన్నారు. అందులో భాగంగా సౌజన్యను అత్తింటివారు, భర్త వేధింపులకు గురిచేశారు. విజయ్ భాస్కర్ పెళ్ళై మూడేళ్ల బాబు ఉన్నా కూడా చాలా మంది యువతులతో పరిచయం పెంచుకుని వారి వద్ద నుండి డబ్బులు కాజేయడం వృత్తిగా మలుచుకున్నాడు. ఫేస్‌బుక్‌లో అందంగా కనిపించే ఆంధ్రా అమ్మాయిలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగినులే అతను టా÷-గ్గ÷ట్‌గా పెట్టుకున్నాడు. ఇప్పటికి పదులకు పైగా అమ్మాయిలను మోసం చేసినట్లు విజయ్‌పై ఆరోపణలు ఉన్నాయి.

భార్య ఉండగానే మరో యువతులతో చాటింగ్‌లు చేస్తూ వారితో ప్రేమాయాణాలు జరిపేవాడు. వారికి హిస్కోలో ఉద్యోగిగా నమ్మిస్తూ బ్యాచిలర్‌నని నమ్మించి బుట్టలో వేసుకునేవాడు. ఇలా బుట్టలో పడిన ఒక యువతి విజయ్ భాస్కర్‌ను పెళ్లి చేసుకుందామని అతని బ్యాక్‌గ్రౌండ్ కనుక్కోగా తతంగం మొత్తం బయటపడింది. విజయభాస్కర్‌కు అప్పటికే వివాహమై కొడుకు కూడా ఉన్నట్లు తెలుసుకుని మోసపోయానని గ్రహించింది. తన దగ్గర విజయ్ భాస్కర్ చేసిన మోసాలకు సంబంధించిన సాక్షాలను వెలుగులోకి తీసుకువచ్చింది.

పెద్దమనుషుల సమక్షంలో కాళ్లు కూడా మొక్కించారు. అయితే ఇప్పుడు విజయ్ భాస్కర్ చేతిలో భార్య సౌజన్య బలైపోయిందని తనకి న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తోంది.

లక్షల్లో కట్నకానుకలు తీసుకుని తనని, తన బాబుని నడిరోడ్డు మీద నిలబెట్టాడని రోదిస్తోంది. విజయ్ భాస్కర్‌పై ఇప్పటికే ప్రకాశం జిల్లా ఒంగోలు మహిళా పోలీసుస్టేషన్‌లో భార్య సౌజన్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా విజయ్ భాస్కర్‌ను ప్రశ్నించడానికి వెళ్లిన సమయంలో భార్య సౌజన్యను విజయ్ భాస్కర్, అతని తల్లిదండ్రులు దాడి చేశారని మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో సైతం కేసు నమోదు చేశారు. తనకి మాత్రం న్యాయం చేయమని సౌజన్య ఆవేదన వ్యక్తం చేస్తోంది.

# సభా సంప్రదాయాలను తుంగలో తొక్కిన బాబు

## 40ఏళ్ల అనుభవం ఏమైందని బొత్స ప్రశ్న



అమరావతి,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): టీడీపీ సభ్యులు కేవలం ఘర్షణ కోసమే అసెంబ్లీకి వచ్చారని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో సమస్యలు చర్చించాలన్న తపన ఎక్కడా కానరాలేదని బొత్స మీడియాతో మాట్లాడుతూ అన్నారు. ప్రతిపక్ష నేతగా చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారు. సభా సంప్రదాయాల్ని చంద్రబాబు తుంగలో తొక్కారని మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు.

పోడియం దగ్గరకు వెళ్లినప్పుడు 40 ఏళ్ల అనుభవం ఏమైంది? స్పీకర్‌ను ఏకవచనంతో పిలుస్తూ అవమానించారు. సభలో మాట్లాడే అవకాశం ఇస్తే వాళ్ల భజనకే ఉపయోగించుకున్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి ప్రతిపక్ష నేతను చూడలేదు. ప్రజలకు ఏం చేశామన్న దాన్ని అసెంబ్లీలో వివరించాం అని మంత్రి పేర్కొన్నారు.

సభా సంప్రదాయాలకు విలువ ఇవ్వకుండా అసెంబ్లీలో స్పీకర్‌ను, మండలిలో ఛైర్మన్‌ను చుట్టుముట్టారు. సభా నియమాలు పాటించకుండా బాబు పోడియం వద్ద బైఠాయించారు. స్పీకర్‌ను బెదిరించేలా అనుచితంగా మాట్లాడారు. స్పీకర్‌పై చంద్రబాబు వ్యక్తిగత దూషణలకు దిగి సభను అపహాస్యం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలో చేస్తున్న

అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని వివరించాం. 5కోట్ల 65లక్షల మంది లబ్ధిదారులకు రూ.67వేల కోట్లు ఖర్చు చేశాం. ఏడాదిన్నర పాలనలో చేసిన సంక్షేమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లెక్కలతో సహా చూపించారు. పోలవరం ఎత్తుపై ఎల్లో మీడియాలో తప్పుడు ప్రచారం చేశారు. అసెంబ్లీ సాక్షిగా పోలవరం ఎత్తును ఒక్క సెం.మీ కూడా తగ్గించలేదని సీఎం చెప్పారని' బొత్స తెలిపారు.

# గెలుపు ఓటములు సహజం

## నూతన పీసీసీ నియామకం తర్వాత రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుంది ?
## కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి



రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 5 (నేటి నిజం ప్రతినిధి):రాజకీయాల్లో గెలుపోటములు సహజం అని వేములవాడ కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ సాగరం వెంకటస్వామి అన్నారు. ఆయన మాట్లాడుతూ రాజకీయంలో గెలుపు ఓటములు సహజమని నిన్న జరిగిన జిహెచ్ఎంసి ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి చెందిన ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నటికీ చెరిగిపోదు అని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని ఆయన అన్నారు కొత్త పిసిసి అధ్యక్షుడు ఎన్నిక తర్వాత కాంగ్రెస్ పార్టీలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడతదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పేద ప్రజలకు అండగా ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీని ప్రజలందరూ ఆశీర్వదిస్తారని. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు అధైర్య పడవద్దని రానున్నది కాంగ్రెస్ పార్టీ కిమంచి రోజులు రాబోతున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు ఆయన వెంట నాయకులు బీసీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ నాగుల రాము గౌడ్. కొలకని రాజు, కనికరపు రాకేష్, పోతుగంటి వెంకన్న, వంగ ప్రణయ్ గౌడ్, గుండం సంతోష్, పులి మల్లేశం గౌడ్, శశిధర్, తదితరులు ఉన్నారు

# బిజెపిలో చేరనున్న మాజీమంత్రి చంద్రశేఖర్

వికారాబాద్,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): గ్రేటర్ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన కాంగ్రెస్ పార్టీకి ఊహించిన షాక్ ఎదురైంది. ఆ పార్టీకి చెందిన మాజీమంత్రి, వికారాబాద్‌కు చెందిన సీనియర్ నేత చంద్రశేఖర్ గుడ్ బై చెప్పే యోచనలో ఉన్నారు. ఇప్పటికే బీజేపీ నుంచి ఆహ్వానం అందినట్లు ఆయన వర్గీయులు చెబుతున్నారు. దీనిపై చర్చించేందుకు ఆదివారం ముఖ్య అనుచరులు, కార్యకర్తలతో భేటీ నిర్వహించ నున్నారు. వారి అభిప్రాయం తీసుకున్న అనంతరం బీజేపీ ముఖ్య నేతలతో సమావేశం కానున్నారు. గతంలో తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన కెసిఆర్ వెన్నంటి ఉన్నారు. తరవాత పార్టీని వీడారు.

# మృతుల కుటుంబాలకు పరామర్శ



రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 5 (నేటినిజం ప్రతినిధి):చందుర్తి మండలం మూడపల్లి సర్పంచ్ చిలుక అంజిబాబు తండ్రి కొండయ్య అనారోగ్యంతో శనివారం మరణించగా కొండయ్య అంత్యక్రియల్లో నియోజకవర్గ టీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు, అలాగే ఎన్గల్ కు చెందిన లింగంపెల్లి మహేష్, దేవయ్య లు ఇటీవల అనారోగ్యంతో మరణించగారెండు కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపారు, ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మరాఠి మల్లిక్, నాయకులు పొన్నాల శ్రీనివాసరావు, తిప్పని శ్రీనివాస్, మ్యాకల ఎల్లయ్య, బైరగోని రమేశ్, లింగంపెల్లి సత్తయ్య, దప్పుల అశోక్, చంటి బాబురావు, బొప్ప వెంకన్న, మాదాసు ప్రసాద్, బొడిగే అనిల్, తిరుపతి, ధర్నా మల్లేశం, తదితరులు పాల్గొన్నారు,

# యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కి సన్మానం



రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 5 (నేట నిజం ప్రతినిధి): వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన ధర్మపురి శ్రీనివాస్ ను శనివారం టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్ సన్మానించారు, చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామానికి చెందిన ధర్మపురి శ్రీనివాస్ నెల రోజుల క్రితం జరిగిన ఆన్లైన్ ఎన్నికల్లో గెలుపొందడంతో పొన్నం ప్రభాకర్ శ్రీనివాస్ ను శాలువాతో సన్మానించారు, ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నాగం కుమార్, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, బి, రవీందర్ తదితరులు ఉన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.